www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -125 బుధవారం19 ఆగస్టు 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

# ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాటం

## సర్దార్ సర్వాయి పాపాన్న గౌడ్ విగ్రహావిష్కరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి

**సర్దార్ సర్వాయి పాపాన్న గౌడ్ గొప్ప యోధుడు**

**హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై విగ్రహావిష్కరణ**

**2029లో మళ్లీ కాంగ్రెస్‌కే అధికారం ఖాయం**

**బిఆర్ఎస్‌లా సొంతవాళ్లకు పదవులు ఇవ్వలేదు**

**ఉద్యమకారులను గుర్తించి ఆదుకుంటున్నాం**



**హైదరాబాద్,ఆగస్టు 18:(ప్రజావినికిడి):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం అద్భుతం అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే పాపన్న విగ్రహానికి ఉండాలని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు

మిగతా 2లో.

# పెట్టుబడిదారులకు స్వర్గధామం తెలంగాణ

**క్లీన్ ఎనర్జీ మ్యానుఫాక్చరింగ్ హబ్‌గా రాష్ట్రం**

**పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలకు ఆహ్వానం**

**2035 నాటికి 26,000 మెగావాట్ల సోలార్, 8,000 మెగావాట్ల విద్యుత్ లక్ష్యం**

**హైటెక్స్‌లో 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి**




**హైదరాబాద్,ఆగస్టు 18: (ప్రజావినికిడి):** తెలంగాణ రాష్ట్రం అన్ని రకాల పెట్టుబడిదారులను ప్రోత్సహించే స్వర్గధామమని, క్లీన్ ఎనర్జీ రంగానికి నిలయంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. హైదరాబాద్‌లోని హైటెక్స్, నోవాటెల్ లో రెండు రోజుల పాటు జరగనున్న 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ / ఎక్స్ పో 2026'ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సమ్మిట్ కు విచ్చేసిన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు మరియు సాంకేతిక నిపుణులను ఉద్దేశించి డిప్యూటీ సీఎం ప్రసంగించారు.

మిగతా 2లో.

# 24 గంటల్లోనే 34 రిజిస్ట్రేషన్లు

**నిషేధిత జాబితా భూ సమస్యలు పరిష్కారం**

**ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం**

**తప్పును సరిదిద్దుకుంటున్నాం**

**మీడియాతో మంత్రి పొంగులేని వివరణ**



**హైదరాబాద్,ఆగస్టు 18(ప్రజావినికిడి):** 22ఏ నిషేధిత భూముల జాబితాలోకి పొరపాటున చేరిన ప్రైవేట్ భూముల సమస్యను పరిష్కరించే పక్రియను వేగవంతం చేశామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

మిగతా 2లో.

# స్థానిక ఎన్నికల్లో 34 శాతం బీసీ రిజర్వేషన్లు

**రాష్ట్రంలో 28 జిల్లా పరిషత్‌ల ఏర్పాటు, మేయర్లు, ఛైర్మన్లకు ప్రత్యక్ష ఎన్నికలు**

**బీసీ రిజర్వేషన్లు తగ్గించి గత ప్రభుత్వం ద్రోహం చేసిందన్న ముఖ్యమంత్రి**

**పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు బీసీలకు అండగా ఉంటామని స్పష్టీకరణ**



**అమరావతి, ఆగస్టు 18:(ప్రజావినికిడి):** "పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు బీసీలకు వెన్నుదన్నుగా నిలుస్తాం" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీ వేదికగా స్పష్టం చేశారు. వెనుకబడిన వర్గాల సామాజిక, రాజకీయ సాధికారతే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని పునరుద్ఘాటించారు. మంగళవారం జరిగిన శాసనసభ సమావేశాల్లో, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచుతూ

మిగతా 2లో.



# గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా వర్ల , దళవాయి రమ

**అభ్యర్థుల ఎంపికకు ఆమోదం తెలిపిన ఏపీ కేబినెట్**

**ఆమోదం కోసం గవర్నర్ వద్దకు చేరిన దస్త్రం**

**సీనియారిటీకి, పార్టీ సేవకు గుర్తింపునిచ్చిన టీడీపీ అధిష్ఠానం**

**గత ఎమ్మెల్సీల పదవీకాలం ముగియడంతో ఏర్పడిన ఖాళీలు**

**అమరావతి, ఆగస్టు 18: (ప్రజావినికిడి):** ఆంధ్రప్రదేశ్‌లో గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాలకు రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థులను ఖరారు చేసింది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సీనియర్ నేత వర్ల రామయ్య, అనంతపురం జిల్లాకు చెందిన బీసీ మహిళా నేత దళవాయి రమాదేవిలను శాసనమండలికి నామినేట్ చేయాలని ఏపీ కేబినెట్ నిర్ణయించింది. ఈ మేరకు సిఫార్సులతో కూడిన దస్త్రాన్ని ఆమోదం కోసం రాజ్ భవన్‌కు పంపింది.

మిగతా 2లో.

# అధికారంలోకి వస్తే పేదలకు ఎకరం భూమి

**టిఆర్ఎస్ భూలక్ష్మి కింద ఎకరం పంపిణీ**

**పేదల భూములను లాక్కుంటూ పోతే చూస్తూ ఊరుకోం**

**టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**



**హైదరాబాద్,ఆగస్టు 18: (ప్రజావినికిడి):** తాము అధికారంలోకి వస్తే 'భూలక్ష్మి' పేరుతో పేదలకు భూమి పంపిణీ చేస్తామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. పేదల భూములను రేవంత్‌రెడ్డి లాక్కుంటే.. చూస్తు ఊరుకోమని హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్.. టీఆర్ఎస్ కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. బీసీలకు పెద్దపీట వేస్తామని చెప్పినా.. ఆచరణలో మాత్రం సామాజిక న్యాయం ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని

మిగతా 2లో.

# మంత్రి పొంగులేటి తక్షణమే రాజీనామా చేయాలి

**రాత్రికి రాత్రే అనేక కాలనీలను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని హరీశ్ రావు మండిపాటు**

**పెద్ద తప్పు చేసి క్షమాపణల చెబితే ప్రజల బాధలు తీరవని వ్యాఖ్య**

**కల్యాణలక్ష్మి పథకాన్ని సంతానలక్ష్మి పథకంగా మార్చేశారని మండిపాటు**



2లో.

# మోదీపై వ్యాఖ్యలకు గట్టిగా బదులివ్వాలి

**: విశాఖలో బీజేపీ శ్రేణులకు నితిన్ నబిన్ పిలుపు**



2లో.

# స్థానిక ఎన్నికల్లో 34 శాతం బీసీ రిజర్వేషన్లు

**మొదటిపేజీ తరువాయి**

కేబినెట్ తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని సీఎం ప్రకటించగానే సభ "జయహో బీసీ" నినాదాలతో దద్దరిల్లింది. ఈ నిర్ణయంతో కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని మరోసారి నిరూపించుకుందని ఆయన అన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, బీసీ రిజర్వేషన్ల కోసమే ప్రత్యేకంగా కేబినెట్ సమావేశం నిర్వహించి ఈ నిర్ణయం తీసుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లను బీసీలకు వర్తింపజేయనున్నట్టు ప్రకటించారు.

ఉమ్మడి రాష్ట్రంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తీసుకొచ్చిన పంచాయతీరాజ్ చట్టం స్ఫూర్తితో, నిబంధనలకు లోబడే ఈ పెంపును అమలు చేస్తున్నామని వివరించారు. 1995, 2001, 2006, 2013 సంవత్సరాల్లో టీడీపీ ప్రభుత్వ హయాంలో 34 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించిన విషయాన్ని ఆయన సభకు గుర్తుచేశారు. ఈ 34 శాతం రిజర్వేషన్ల ప్రతిపాదనను శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించాలని ఆయన కోరారు.స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని చంద్రబాబు పునరుద్ఘాటించారు. 1984లో ఎన్టీఆర్ బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, 73, 74వ రాజ్యాంగ సవరణల స్ఫూర్తితో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 'యాక్ట్ ఆఫ్ 5' కింద దాన్ని 34 శాతానికి పెంచామని తెలిపారు.

తమ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి పనిచేయడం వల్లే ఎర్రన్నాయుడు, కేఈ కృష్ణమూర్తి, యనమల రామకృష్ణుడు, దేవేందర్ గౌడ్, అయ్యన్నపాత్రుడు వంటి లెజెండరీ నాయకులు బీసీ వర్గాల నుంచి ఎదిగారని అన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ ప్రోత్సాహం అందిస్తే ఎంపీటీసీ స్థాయి నేత కూడా ఎంపీగా ఎదగొచ్చని, కర్నూలు జిల్లాకు చెందిన బస్తిపాటి నాగరాజును ఎంపీగా గెలిపించడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్లతో పాటు మరికొన్ని కీలక నిర్ణయాలను కూడా సీఎం ప్రకటించారు. సుస్థిర పాలన కోసం పట్టణ స్థానిక సంస్థల్లో మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్ల ఎన్నికను మళ్లీ ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహిస్తామని వెల్లడించారు. పరిపాలనా సౌలభ్యం కోసం ప్రస్తుతం 13గా ఉన్న జిల్లా ప్రజా పరిషత్‌ల సంఖ్యను 28కి పెంచుతున్నట్లు తెలిపారు. 16వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన రూ.2,300 కోట్ల గ్రామీణ, రూ.1,562 కోట్ల పట్టణ గ్రాంట్లు పొందాలంటే స్థానిక ఎన్నికలు నిర్వహించడం అత్యవసరమని స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు, గ్రామీణ వృత్తులకు బీసీలే వెన్నెముక అని సీఎం కొనియాడారు. వారి నైపుణ్యానికి సాంకేతికతను జోడించి ప్రపంచానికి పరిచయం చేస్తామన్నారు. బీసీ రెసిడెన్షియల్ స్కూళ్లను అభివృద్ధి చేసి నాణ్యమైన విద్య అందిస్తామని, విద్య, ఉపాధి, నైపుణ్యం ద్వారా వారిని ఉన్నత స్థానంలో నిలబెడతామని హామీ ఇచ్చారు. బీసీలంటే వెనుకబడిన వర్గాలు కాదని, అవకాశం రాక వెనుకబడినవారని, వారికి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ చారిత్రక ప్రకటన అనంతరం బీసీ వర్గాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు సీఎం వద్దకు వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు.

# అధికారంలోకి వస్తే పేదలకు ఎకరం భూమి

**మొదటిపేజీ తరువాయి**

భూమిలేని పేదలకు ఎకరం చొప్పున భూమి ఇచ్చేలా 'భూ లక్ష్మి పథకం' అమలు చేస్తామని ఆ పార్టీ అధినేత్రి కవిత ప్రకటించారు. రాష్ట్రంలో భూమి పంపిణీ అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భూమి కేవలం లావాదేవీల అంశంగా కనిపించవచ్చని, అయితే పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భూమి, అడవి జీవనాధారమని కవిత వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు చేపట్టినా ముందుగా అసైన్డ్ భూములనే తీసుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో సుమారు 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను ప్రభుత్వం తీసుకుందని కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పేదలకు అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి సోదరులపై కూడా కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. వారి ఆధ్వర్యంలో భూ దోపిడీ జరుగుతోందని ఆరోపిస్తూ.. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలనను తీవ్రంగా విమర్శించారు. రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల ప్రభావం ప్రభుత్వంలో కొనసాగుతోందని ఆమె ఆరోపించారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి.. గత 31 నెలల్లో ఆ అంశాన్ని ఎందుకు పట్టించుకోలేదని కవిత ప్రశ్నించారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడే ముందు కేబినెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. ప్రభుత్వ సలహాదారుల నియామకాల్లోనూ బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఒకే రోజు శివధర్‌రెడ్డి, వీహెచ్‌లను సలహాదారులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని, అయితే ఇద్దరి వేతనాల్లో తేడా ఎందుకు ఉందని ప్రశ్నించారు. ఆర్టీఐ కమిషన్‌లో ఒక్క బీసీకి కూడా అవకాశం కల్పించలేదని కవిత ఆరోపించారు. ప్రభుత్వ నియామకాల్లో సామాజిక న్యాయం పాటించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో అగ్రవర్ణాలకు ఒక న్యాయం, పేదలకు మరో న్యాయం కొనసాగుతోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కవిత సూచించారు.విజయశాంతి లాంటి ఉద్యమకారులను పక్కన పెట్టి.. మంత్రి పదవి ఇవ్వకుండా ఎమ్మెల్సీ పదవితో సరిపెట్టారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి చెప్పేది సామాజిక న్యాయం.. కానీ ఆచరణలో మాత్రం అటవికా న్యాయమని విమర్శించారు. అప్పర్ క్లాస్ మాట్లాడితే ఒక రకమైన చర్యలు.. లో క్లాస్ మాట్లాడితే మరో రకమైన చర్యలు తీసుకుంటారా ఇదేనా రేవంత్‌రెడ్డి సామాజిక న్యాయం? అని ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణలో రేవంత్ రాక్షస పాలన సాగుతోందని విమర్శించారు. రేవంత్ రెడ్డికి భూమి అంటే కమర్షియల్ ట్రాన్సాక్షన్‌గా మారిపోయిందని

ధ్వజమెత్తారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో కూడా మూడు వేల ఎకరాల భూమిని పేదలకు ఇచ్చిందని.. ఆ తర్వాత ఆపేసిందని అన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న, అన్యాక్రాంతమైన భూములను సేకరించి పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఒక్కో కుటుంబానికి ఎకరం భూమి ఇవ్వడం సాధ్యమేనని చెప్పుకొచ్చారు. రేవంత్ రెడ్డి – పదేపదే గతంలో జరిగిన విషయాలనే ప్రస్తావిస్తూ.. చేయాల్సిన పనులను పక్కన పెట్టకూడదని కవిత పేర్కొన్నారు.

# మోదీపై వ్యాఖ్యలకు గట్టిగా బదులివ్వాలి

## : విశాఖలో బీజేపీ శ్రేణులకు నితిన్ నబిన్ పిలుపు



**విశాఖపట్నం (ప్రజావినికిడి):**
దేశంలోని ప్రతిపక్షాలు అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తున్నాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రతిపక్ష నేతలు ఉపయోగిస్తున్న అనుచిత భాషపై పార్టీ శ్రేణులు సంయమనం పాటిస్తూనే, పార్టీ గౌరవానికి భంగం కలగకుండా దీటుగా సమాధానం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం విశాఖపట్నంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజాస్వామ్య వ్యవస్థలను అవమానపరుస్తోందని నితిన్ నబిన్ విమర్శించారు. "పార్లమెంటులో ప్రతిపక్షాల తీరు, స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల సందర్భంగా కాంగ్రెస్ నాయకుల ప్రవర్తనను యావత్ దేశం గమనించింది. బీజేపీ కార్యకర్తలు ఎల్లప్పుడూ క్రమశిక్షణతో ఉంటారు, అయితే ప్రధానమంత్రి పట్ల ఉపయోగించిన పరుష పదజాలాన్ని ఏమాత్రం ఉపేక్షించకూడదు" అని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని 'పార్ట్-టైమ్ రాజకీయ నాయకుడు' అని ఎద్దేవా చేస్తూ, ఆయన కేవలం ప్రజల దృష్టిని మళ్లించే అంశాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు.

ప్రధాని మోదీ నాయకత్వంలో 'వికసిత భారత్' ఆవిష్కారమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందని, దేశవ్యాప్తంగా రూ. 8 లక్షల కోట్లకు పైగా విలువైన మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. నేటి యువత కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, స్టార్టప్‌ల ద్వారా ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగిందని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను, పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలోకి బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయన నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర పార్టీ ఇన్చార్జిలు, జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.

# ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాటం

**మొదటిపేజీ తరువాయి**



మహేశ్‌కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. అమరవీరుల స్థూపానికి ఎంత ప్రాధాన్యం ఉంటుందో పాపన్న విగ్రహానికి కూడా అంతే ప్రాధాన్యం ఉండాలని అన్నారు. బీసీ నేతల విజ్ఞప్తి మేరకు నెక్లెస్ రోడ్డుపై పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. చరిత్రను చెప్పుకోవడంలో మనం వెనుకబడ్డా మని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అక్రమ సంపాదనతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. 2029లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ జరిగితే 117 సీట్లతో అధికారంలోకి వస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. కేసీఆర్ సీఎం అయితే.. ఆయన కుమారుడు వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యారని గుర్తు చేశారు. కానీ రేవంత్ ముఖ్యమంత్రి అయితే.. మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్ అయ్యారని.. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సీతక్క, వాకిటి శ్రీహరి మంత్రులయ్యారని సోదాహరణంగా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఉద్యమకారులకు కీలక పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనవరాలికి పదవులిచ్చామని పేర్కొన్నారు. అయితే కేసీఆర్ మాత్రం ఎర్రబెల్లి, వినోద్‌రావుకు పదవులిచ్చారని వ్యంగ్యంగా అన్నారు. కేసీఆర్ సీఎం అయితే.. వారి కుటుంబ సభ్యులకు ఫామ్‌హౌజ్‌లు వచ్చాయని ఎద్దేవా చేశారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వస్తున్నాయని వివరించారు. దిశ బాగుంటుందని కేసీఆర్ కొత్త సచివాలయం కట్టుకున్నారని తెలిపారు. కానీ కేసీఆర్ దిశ, దశ బాగా లేదు.. అందుకే తాను, భట్టి సచివాలయంలో ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. బీసీల లెక్కలు తేల్చిన తొలి ప్రభుత్వం మాదేనని అన్నారు. కేసీఆర్ చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పు తెలంగాణ పాలిట ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వడ్డీలు కట్టగా మిగిలిన డబ్బుతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గీత కార్మికుల వృత్తిని కాపాడే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని రేవంత్‌రెడ్డి తెలిపారు. అర్హత ఉన్న గీత కార్మికులకు పెన్షన్లు అందించేలా ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. ఇరిగేషన్ కాల్వలపై ఈత, తాటి చెట్లను పెంచే చర్యలు చేపడతామని వెల్లడించారు. అలాగే గౌడ సామాజికవర్గం సహకారంతో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి పనిచేస్తున్నామని, తమ కాంబినేషన్‌లో 2029లోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇందిరమ్మ పాలనలో తెలంగాణ బహుజనుల తెలంగాణగా మారుతుందని సీఎం అన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సర్వాయి పాపన్న ఆలోచనలకు అనుగుణంగా పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, సన్నబియ్యం వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. గత పదేళ్ల పాలనపై సీఎం తీవ్ర విమర్శలు చేశారు. గత పాలకులు కులవృత్తులు చేసుకోవాలని చెప్పారని, తమ ప్రభుత్వం మాత్రం సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 'కేసీఆర్‌ది ఫ్యామిలీ జస్టిస్ అయితే.. మాది సోషల్ జస్టిస్' అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 117 సీట్లు వస్తాయని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజలదేనని, మరోసారి పాత పాలనకు వెళ్లకుండా ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం కుటుంబంలా పనిచేస్తోందని, ఏ సమస్య ఉన్నా చర్చించి పరిష్కరించుకునే విధానాన్ని అనుసరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంగ్రెస్ నాయకులతో పాటు బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా వర్ల , దళవాయి రమ

**మొదటిపేజీ తరువాయి**

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఉన్న పండుల రవీంద్రబాబు, జాకియా ఖానమ్‌ల పదవీకాలం ముగియడంతో ఈ రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి. ఈ నేపథ్యంలో అధికార టీడీపీ, పార్టీకి సుదీర్ఘ కాలంగా సేవలందిస్తున్న ఇద్దరు నేతలకు అవకాశం కల్పించింది. దళిత వర్గానికి చెందిన వర్ల రామయ్య పార్టీలో కీలక నేతగా, గతంలో ఆర్టీసీ ఛైర్మన్‌గా పనిచేశారు. పార్టీ వాయిస్‌ను బలంగా వినిపించడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. 2009లో తిరుపతి లోక్‌సభ స్థానం నుంచి ఆయన పోటీ చేశారు.

మరోవైపు, అనంతపురం జిల్లాకు చెందిన దళవాయి రమాదేవి బీసీ (వడ్డెర) సామాజిక వర్గానికి చెందిన నాయకురాలు. రెండు దశాబ్దాలుగా ఆమె పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం అనంతపురం పార్లమెంట్ అంగన్‌వాడీ సంఘం అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. ఆమె కుటుంబం మొదటి నుంచి టీడీపీకి అండగా నిలుస్తోంది. 2021లో అనంతపురం కార్పొరేటర్‌గా పోటీ చేసిన రమాదేవి, 2024 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి విశేషంగా కృషి చేశారు.

సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని, పార్టీకి విధేయంగా ఉన్న సీనియర్ నేతకు, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న మహిళా నేతకు పదవులు ఇవ్వడం ద్వారా టీడీపీ అధిష్ఠానం స్పష్టమైన సందేశం పంపినట్టయింది. ప్రస్తుతం ఈ ఫైల్ గవర్నర్ పరిశీలనలో ఉండగా, ఆయన ఆమోదముద్ర వేయగానే వీరి నియామకం అధికారికంగా ఖరారు కానుంది.

# పెట్టుబడిదారులకు స్వర్గధామం తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి**

పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, సీఈఓలు... మీ అందరినీ ఆహ్వానిస్తున్నాను, రండి. తెలంగాణ అన్ని రకాల పెట్టుబడి దారులను ప్రోత్సహించే రాష్ట్రం, ఇది పెట్టుబడిదారులకు ఒక స్వర్గధామం. మన సమృద్ధిని పంచుకోవ డానికి మరియు కలిసి ఎదగడానికి మిమ్మల్ని పూర్ణహృదయంతో ఆహ్వానించడానికి ఈ రాష్ట్రం సిద్ధంగా ఉంది' అని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఇంధన రంగంలో మార్పు అనేది కేవలం విద్యుత్ ఉత్పత్తి మూలాన్ని మార్చడం మాత్రమే కాదని, అది సమగ్ర ఆర్థిక వ్యవస్థ నిర్మాణాన్నే మార్చే విప్లవాత్మక పక్రియ అని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణను కేవలం స్వచ్ఛమైన ఇంధనాన్ని వినియోగించే రాష్ట్రంగా మాత్రమే కాకుండా, ప్రపంచ క్లీన్ ఎనర్జీ రంగానికి అవసరమైన సాంకేతికతలను తయారు చేసే ప్రధాన కేంద్రంగా నిలపాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుంటూనే, పర్యావరణ పరిరక్షణను సాధించేలా ప్రణాళికలు రూపొందించామని డిప్యూటీ సీఎం వివరించారు. ఇందులో భాగంగా 2030 నాటికి 20,000 మెగావాట్లు, 2035 నాటికి 26,000 మెగావాట్లకు పైగా సోలార్ విద్యుత్ సామర్థ్యాన్ని పెంచనున్నట్లు తెలిపారు. అలాగే పునరుత్పాదక ఇంధనానికి అత్యంత కీలకమైన 'విద్యుత్ నిల్వ' సామర్థ్యాన్ని కూడా భారీగా విస్తరిస్తున్నామని చెప్పారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా 2030 నాటికి 3,800 మెగావాట్లు, 2035 నాటికి 8,000 మెగావాట్ల నిల్వ వ్యవస్థను అందుబాటులోకి తెస్తామన్నారు. హైదరాబాద్‌లోని ఐటీ, ఏఐ నైపుణ్యాలను ఉపయోగించి భవిష్యత్తు విద్యుత్ గ్రిడ్‌ను డిజిటల్ నెట్‌వర్క్‌గా మారుస్తున్నామని ఆయన పేర్కొన్నారు. 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో ఏర్పాటు చేయబోయే ఏఐ డేటా సెంటర్ కోసం ప్రత్యేకంగా 100 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్లాంట్‌ను అనుసంధానిస్తున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు 2030 నాటికి ఏటా 4 లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, 2035 నాటికి 12,000 ఇ÷ఎ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సోలార్, విండ్, బ్యాటరీ ఉత్పత్తులను ఇక్కడే తయారు చేసే కంపెనీలకు మూలధన సాయం, ÷ూఉ÷ రీయింబర్స్‌మెంట్, విద్యుత్ సుంకం మినహాయింపులతో పాటు ÷ుఉ-తిఖం÷ూ ద్వారా వేగవంతమైన అనుమతులు ఇస్తున్నామని వివరించారు. ప్రభుత్వం, ప్రైవేట్ భాగస్వామ్యంతోనే ఈ ఇంధన విప్లవం సాధ్యమవుతుందని, తెలంగాణతో కలిసి నడవాలని పారిశ్రామికవేత్తలకు డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం ఏర్పాటుచేసిన వివిధ స్టాల్స్ ను ఆయన సందర్శించారు. డిప్యూటీ సీఎం వెంట స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్ తదితరులు ఉన్నారు.

# 24 గంటల్లోనే 34 రిజిస్ట్రేషన్లు

**మొదటిపేజీ తరువాయి**

24 గంటల్లోనే మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో 4.. మొత్తం 34 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని వెల్లడించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిజమైన ప్రైవేట్ ఆస్తులకు పూర్తి రక్షణ కల్పిస్తామని స్పష్టం చేశారు.

మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి.. 22ఏ జాబితా విషయంలో జరిగిన పొరపాట్లను ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. హైకోర్టు ఆదేశాల మేరకు నిషేధిత భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో క్షేత్రస్థాయిలో కొన్ని తప్పులు జరిగాయని, వాటిని సరిదిద్దే పక్రియను ప్రభుత్వం వేగంగా చేపట్టిందని వివరించారు. ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయడం లేదని పొంగులేటి అన్నారు. పొరపాటు జరిగితే దాన్ని అంగీకరించడం తో పాటు.. దాని వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పరిష్కరించడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో వివిధ జీవోలు, మెమోల ద్వారా క్రమబద్ధీకరించిన కొన్ని ప్రైవేట్ భూములు, హైకోర్టు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులు పొందిన స్థలాలు కూడా సాంకేతిక కారణాలతో 22ఏ జాబితాలోకి చేరినట్లు తెలిపారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిన వెంటనే చర్యలు ప్రారంభించామని, అర్హత ఉన్న భూముల రిజిస్ట్రేషన్ల పక్రియను పునరుద్ధరించామని మంత్రి వెల్లడించారు. 22ఏ భూములకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పొంగులేటి తెలిపారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీతో పాటు ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.రాబోయే 15 రోజుల పాటు ఈ కమిటీ ప్రతిరోజూ దరఖాస్తులను పరిశీలించనుందని, అర్హత ఉన్న నిజమైన ప్రైవేట్ ఆస్తులను వీలైనంత త్వరగా 22ఏ జాబితా నుంచి తొలగించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. పేదల హక్కులు, ఆస్తులకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తుందని పొంగులేటి స్పష్టం చేశారు. చట్టబద్ధంగా ఉన్న పేదల భూమిలో ఒక్క అంగుళాన్ని కూడా ప్రభుత్వం తీసుకోదని అన్నారు. ఇది పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వమని పేర్కొన్నారు. 22ఏ సమస్యను రాజకీయంగా ఉపయోగించుకోవద్దని మంత్రి కోరారు. ప్రజల్లో అనవసరమైన ఆందోళన సృష్టించేలా ఆరోపణలు, ప్రచారం చేయడం సరికాదన్నారు. 'మేం జరిగిన తప్పును అంగీకరించి సరిదిద్దుతున్నాం. ప్రజలను ఇబ్బందుల్లో వదిలేయడం మా ప్రభుత్వ విధానం కాదు' అని స్పష్టం చేశారు. అధికారులపై బాధ్యత నెట్టేసి ప్రభుత్వం చేతులు దులుపుకోదని, సమస్యకు పరిష్కారం చూపించడమే తమ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ప్రజల ఆస్తులు, హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

# మంత్రి పొంగులేటి తక్షణమే రాజీనామా చేయాలి

**రాత్రికి రాత్రే అనేక కాలనీలను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని హరీశ్ రావు మండిపాటు**

**పెద్ద తప్పు చేసి క్షమాపణల చెబితే ప్రజల బాధలు తీరవని వ్యాఖ్య**

**కల్యాణలక్ష్మి పథకాన్ని సంతానలక్ష్మి పథకంగా మార్చేశారని మండిపాటు**

సమస్యలను పరిష్కరించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త చిక్కులు సృష్టిస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరి పిచ్చోడి చేతిలో రాయిలా తయారైందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాత్రికి రాత్రే అనేక కాలనీలను 22ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చడం వల్ల సామాన్య ప్రజలు నరకం చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 22ఏ నిషేధిత భూముల జాబితాను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.22ఏ నిషేధిత భూముల వ్యవహారంలో జరిగిన పెద్ద తప్పిదానికి నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంత్రిని పదవి నుంచి తొలగించకపోతే... ముఖ్యమంత్రి, మంత్రులు కలిసే ఈ భూదందా చేశారనే అనుమానాలు ప్రజల్లో మరింత బలపడతాయని వ్యాఖ్యానించారు. పెద్ద తప్పు చేసి ఇప్పుడు క్షమాపణలు చెబితే ప్రజల బాధలు తీరవని, అసలు ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చమని ఆదేశించింది ఎవరో సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రభుత్వం చేసిన తప్పులను అధికారుల మీదికి నెట్టి తప్పించుకోవాలని చూడటం సరికాదని, వారు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ కూడా పనిచేయడం లేదని విమర్శించారు.

భూములను నిషేధిత జాబితాలో పెట్టింది ప్రభుత్వమే కాబట్టి, ప్రజల నుంచి మళ్లీ దరఖాస్తులు తీసుకోకుండా వెంటనే ఆ జాబితా నుంచి తొలగించాలని హరీశ్ రావు స్పష్టం చేశారు. 2008లోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం యూఎల్సీని రద్దు చేయడంతో ఆ స్థలాలు పట్టా భూములుగా మారాయని... అలాగే జీఓల ద్వారా మినహాయింపు పొందిన హెచ్ఎండీఏ, హుడా భూములను కూడా ఇప్పుడు 22ూ లో చేర్చి రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ప్రజలను వేధిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో కల్యాణలక్ష్మి పథకం 'సంతానలక్ష్మి'గా మారిపోయిందని, పెళ్లి సమయానికి అందాల్సిన సాయం పిల్లలు పుట్టిన తర్వాత గానీ రావడం లేదని ఎద్దేవా చేశారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తప్పు చేసిన కాంగ్రెస్ నేతలను చట్టపరంగా బాధ్యులను చేస్తామని హెచ్చరిస్తూ, 22ూ భూముల అంశంపై కేసీఆర్ నాయకత్వంలో అసెంబ్లీ వేదికగా పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
బుధవారం19 ఆగస్టు 2026

# హైదరాబాద్‌లో కల్తీ నెయ్యి హెచ్ -ఫాస్ట్ దాడులు..

## హైదరాబాద్‌లో భారీ ఆపరేషన్ -130 తయారీ కేంద్రాల్లో తనిఖీలు

## 36 టన్నుల కల్తీ నెయ్యి సీజ్! -కల్తీ నెయ్యి అమ్మితే కఠిన చర్యలు తప్పవు సీపీ సజ్జనార్..





**హైదరాబాద్, (ప్రజావినికిడి):**
భాగ్యనగరంలో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న నకిలీ నెయ్యి తయారీ, విక్రయ ముఠాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. స్వచ్ఛమైన దేశీ నెయ్యి పేరుతో మార్కెట్‌లో యథేచ్ఛగా సాగుతున్న భారీ కల్తీ దందాను అధికారులు బహిర్గతం చేశారు. హైదరాబాద్ నగరవ్యాప్తంగా సాగిన ఈ విస్తృత దాడుల్లో ఏకంగా 36 టన్నుల అపరిశుభ్ర,కల్తీ నెయ్యితో పాటు, దాని తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలు, ప్రమాదకర రసాయనాలను సీజ్ చేసినట్లు పోలీసులు మంగళవారం వెల్లడించారు.

### 130 స్థావరాలపై దాడులు..

విశ్వసనీయ సమాచారం, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 'హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వేలెన్స్ టీమ్' (హెచ్-ఫాస్ట్), ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అధికారులు సంయుక్తంగా ఈ ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. నగరవ్యాప్తంగా ఉన్న 39 నెయ్యి తయారీ యూనిట్లు,91 విక్రయ కేంద్రాలతో కలిపి మొత్తం 130 ప్రాంగణాల్లో అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేపట్టారని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ స్పష్టం చేశారు. తనిఖీల సమయంలో అధికారులకు షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. నాసిరకం పదార్థాలు, శరీరానికి తీవ్ర హాని కలిగించే అనుమతి లేని రసాయనాలను క్రమబద్ధంగా కలిపి కృత్రిమ నెయ్యిని తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.ఈ దాడుల్లో భాగంగా 36 టన్నుల కల్తీ నెయ్యి,మీగడ (ముడి సరుకు), పామాయిల్, వనస్పతి, కృత్రిమ నెయ్యి సువాసనలు తెచ్చే రసాయనాలు, స్టార్చ్,ఇతర కెమికల్ అడిటివ్స్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు జప్తు చేశాయి.ఘటన స్థలంలోనే ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్లు ల్యాబ్ పరీక్షల కోసం నమూనాలను సేకరించారు.

"కల్తీ మిశ్రమాన్ని '100% ప్యూర్ దేశీ నెయ్యి'అనే ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో సాధారణ ప్రజలకు విక్రయిస్తున్నారు. ఇది ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పు కలిగిస్తుంది,"అని సీపీ సజ్జనార్ ఆందోళన వ్యక్తం చేశారు.అసలైన నెయ్యి రుచి, సువాసన, రంగును కృత్రిమంగా రప్పించడానికి కొందరు తయారీదారులు పామాయిల్, వనస్పతి,స్కిమ్డ్ మిల్క్ పౌడర్, స్టార్చ్, కెమికల్ ఫ్లేవర్లను వాడుతున్నారని సీపీ సజ్జనార్ వివరించారు. చివరికి కొన్ని ఉత్పత్తుల్లో అసలు పాలకు సంబంధించిన ఏ ఒక్క పదార్థం కూడా లేకపోవడం గమనార్హం.

### బాధ్యతారాహిత్యంగా ప్యాకింగ్, విక్రయాలు..

ఈ కల్తీ ఉత్పత్తులను పారదర్శక కవర్లలో ప్యాక్ చేసి "100% స్వచ్ఛమైన నెయ్యి", "ప్రీమియం నెయ్యి", "ఫార్మ్ ఫ్రెష్ నెయ్యి", "నేచురల్ నెయ్యి" అనే పేర్లతో మార్కెట్‌లో విక్రయిస్తున్నారని టాస్క్‌ఫోర్స్ డిసిపి గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు.ఈ ప్యాకెట్లపై కనీస నిబంధనలైన బ్యాచ్ నంబర్, ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ వివరాలు, తయారీ మరియు గడువు ముగిసే తేదీలు, క్వాలిటీ సర్టిఫికేట్ వంటివి ఏవీ ముద్రించలేదని ఆయన వెల్లడించారు. కల్తీ శాతాన్ని బట్టి (10 శాతం నుంచి 40 శాతం వరకు) ఈ నకిలీ నెయ్యిని వేర్వేరు వ్యాపారాలకు మళ్లించేవారని దర్యాప్తులో తేలింది.తక్కువ కల్తీ ఉన్నదాన్ని హోటళ్లు,టిఫిన్ సెంటర్లు,స్వీట్ షాపులు, ఆయుర్వేద దుకాణాలకు సరఫరా చేస్తుండగా, తీవ్రంగా కల్తీ చేసిన నెయ్యిని పూజల కోసం వాడే నెయ్యిగా మార్కెట్‌లోకి వదిలారు.ఈ తయారీకి కావాల్సిన పాల మీగడను మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి తెప్పించుకునేవారని పోలీసులు తెలిపారు. చవకైన ప్రత్యామ్నాయ పదార్థాలతో అతి తక్కువ ఖర్చుతో ఈ నకిలీ నెయ్యిని తయారు చేసి, మార్కెట్‌లో అసలైన నెయ్యి ధరలకు అమ్మి అక్రమార్కులు భారీగా లాభాలు గడించారని పోలీసులు పేర్కొన్నారు.ఈ కల్తీ నెయ్యిని కేవలం హైదరాబాద్‌లోనే కాకుండా తెలంగాణ వ్యాప్తంగా, పొరుగు రాష్ట్రాలకు కూడా సరఫరా చేసినట్లు విచారణలో వెల్లడైంది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై కేసులు నమోదు చేసే ప్రక్రియ వేగంగా జరుగుతోందని సీపీ సజ్జనార్ వివరించారు

### కల్తీ ఆహారపదార్థాలతో ప్రజారోగ్యానికి గండి

ఆహార పదార్థాలను విచ్చలవిడిగా కల్తీ చేస్తూ కొంతమంది అక్రమార్కులు సమాజంపై నిశ్శబ్ద దాడికి దిగుతున్నారు. రసాయనాలు, నాణ్యత లేని కల్తీ ఆహారపదార్థాలతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు.కల్తీ ఆహారంపై ఉక్కుపాదం మోపాలన్న ప్రభుత్వ ఆదేశాలతో కల్తీ రాయుళ్లపై హెచ్-ఫాస్ట్ కొరడా ఝులిపించింది. ఇటీవల ఫుడ్‌సేఫ్టీ అధికారులు పలు హోటళ్లులో నిర్వహించిన తనిఖీల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. పరిశుభ్రత లేని ఆహారపదార్థాలు,బొద్దింకలు లాంటివి దర్శనమిచ్చాయి.

# ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి**

**కాంగ్రెస్ కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుంది**

**పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి**

**కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోగురి పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమీక్ష సమావేశం**

**కొందుర్గులో కాంగ్రెస్ విస్తృత స్థాయి సమీక్ష సమావేశానికి పెద్ద ఎత్తున కార్యకర్తల హాజరు**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
కొందుర్గు మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోగురి పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని చల్లా నర్సింహా రెడ్డి భరోసా ఇచ్చారు. రాబోయే కాలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించి,వాటిపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని కోరారు.ఈ సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోగురి పురుషోత్తం రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జితేందర్, దామోదర్ రెడ్డి, డీసీసీ కార్యదర్శులు గోవర్ధన్ గౌడ్, అంజి రెడ్డి, మల్లేష్ గౌడ్, మంగులాల్ నాయక్,జాకారం శేఖర్,సత్యం రెడ్డి,బ్యాటరీ కృష్ణారెడ్డి, రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సర్పంచులు అంజి,విక్రమ్ రెడ్డి, రాజకుమార్, రమేష్,గోపాల్ నాయక్,శ్రీకాంత్, యాదమ్మ, నర్సింలు,జీబీ కృష్ణ,మాజీ సర్పంచులు ఫయం, యాదయ్య, రాంరెడ్డి, కృష్ణయ్య, జంగయ్య,మాజీ ఎంపీటీసీ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు బోరేగా నరేందర్, బోరేగా యాదయ్య, వజ్రమ్మ,శ్రీనివాస్ నాయక్,మంత్రి మల్లేష్, మల్లయ్య, రామస్వామి, మనయ్య, నర్సింలు, గోపాల్, అమర్‌నాథ్, ఎస్సీ సెల్ నాయకులు జలు హరీష్,నరేష్, శ్రీకాంత్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.





# ప్రభుత్వ డ్యూటీనా..
# ప్రైవేటు హాస్పిటల్‌లో సేవలా.?

## చిన్నపిల్లల వైద్యుడి వ్యవహారంపై ప్రశ్నలు..
## ప్రైవేట్ హాస్పిటల్‌లోనే ఎక్కువ సమయం.?



**మెదక్,(ప్రజావినికిడి):**
ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్నపిల్లల వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న వ్యక్తికే ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు యాజమాన్యతో సంబంధం ఉందని,దానితో ప్రభుత్వ హాస్పటల్ లో సేవలు పక్కకు పెట్టి ప్రైవేటు హాస్పిటల్ లోనే ఎక్కువ వైద్య సేవలు అందిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహించే సమయంలోనే ప్రైవేట్ హాస్పిటల్‌లోనూ వైద్యం ఎలా అందిస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులను ప్రైవేటు హాస్పిటల్ కు మన్నిస్తున్నట్లు దానితో తరచూ పేషెంట్లు ప్రైవేట్ హాస్పిటల్ వద్ద కనిపిస్తుండటంతో ప్రభుత్వ ఆస్పత్రి కంటే ప్రైవేటు హాస్పిటల్‌లోనే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారా.? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై జిల్లా ఆరోగ్యశాఖ అధికారి పూర్తిస్థాయి విచారణ చేయించి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని అదే కాకుండా ఇలా జరిగితే అధికారిని వెంటనే ఉద్యోగం నుండి శాశ్వతంగా తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వ ఆస్పత్రి డ్యూటీ, మరోవైపు ప్రైవేట్ హాస్పిటల్‌లో వైద్యం,రెండు చోట్ల విధులు ఎలా సాధ్యమవుతున్నాయన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.ఈ ఆరోపణలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విచారణ జరిపి, డాక్టర్ డ్యూటీ సమయాలు, హాజరు రికార్డులు, సీసీటీవీ ఫుటేజీవులు ప్రైవేట్ ప్రాక్టీస్‌కు సంబంధించిన నిబంధనలు పరిశీలించి వాస్తవాలను తెలపాలని ప్రజలు కోరుతున్నారు.

## బాలనగర్ మండలం ఉడిత్యాల వద్ద
# ఘోర రోడ్డు ప్రమాదం

**షాద్ నగర్ ఆర్టీసీ బస్సు,మోటార్ సైకిల్ ఢీకొని యువకుడు మృతి**

**మృతి చెందిన వ్యక్తి వీరన్న పల్లి గ్రామానికి చెందిన జి.అరవింద్ గా గుర్తింపు**



మృతి చెందిన యువకుడు అరవింద్



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
మహబూబ్‌నగర్ జిల్లా బాలనగర్ మండలం ఉడిత్యాల గ్రామ సమీపంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న 25 ఏళ్ల యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరన్నపల్లికి చెందిన గంటయ్యల అరవింద్ (25) ఉద్యోగ నిమిత్తం తన హోండా యూనికాన్ మోటార్‌సైకిల్‌పై వీరన్నపల్లి నుంచి బాలనగర్ వైపు బయలుదేరాడు. ఉడిత్యాల సమీపంలోకి చేరుకోగానే షాద్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (టీజీ 07 జెడ్ 0032) అరవింద్ ప్రయాణిస్తున్న బైక్ (పీజీ 06 ఎ 0922)ను ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో అరవింద్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు.ప్రమాదంపై పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.ఘటనపై షాద్‌నగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ లో తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ప్రతీకగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఫరూఖ్‌నగర్ ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఆయన విగ్రహానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ధైర్యసాహసాలు,పోరాట స్ఫూర్తి, బహుజనుల ఆత్మగౌరవం కోసం చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు.ఆయన ఆశయాలనునేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్.కొత్తూరు గోవర్ధన్ గౌడ్.తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు.గౌడ సంఘం నాయకులు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మేనకోడలు వివాహానికి ప్రముఖులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆహ్వానం

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు ఆహ్వాన శుభలేఖలు**

**ఈ నెల 27న రాణిశివకుమార్ వివాహ వేడుక**







**షాద్ నగర్,(ప్రజావినికిడి):** ఈ నెల 27వ తేదీన జరగనున్న తన మేనకోడలు రాణిశివకుమార్ వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ ప్రముఖులను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి వివాహ ఆహ్వాన శుభలేఖను అందజేశారు. అదేవిధంగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డి, మాజీ మంత్రి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్ రెడ్డి, ముఖ్యమంత్రి సోదరుడు కొండల్ రెడ్డి, సీనియర్ నాయకులు కాశీనాథ్ రెడ్డి తదితరులను కలిసి వివాహ ఆహ్వాన శుభలేఖలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ వివాహ వేడుకకు విచ్చేసి నూతన వధూవరులు రాణి, శివకుమార్‌లను ఆశీర్వదించాలని ప్రముఖులను సాదరంగా ఆహ్వానించినట్లు తెలిపారు.

# ఎంజీబీఎస్‌లో టీజీఎస్ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ




**రంగారెడ్డి,(ప్రజావినికిడి):** టీజీఎస్ఆర్టీసీ రంగారెడ్డి డివిజన్ డ్రైవర్లకు మహాత్మాగాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్)లో డ్రైవర్ శిక్షణ, రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బహుకుమార్ సీఈఓ కేజీలాల్, ఎండీ పాకాల సి. హెచ్. వైభోగనాథ్,టి.టి ఐ ప్రధాన కానిస్టేబుల్, గోషామహల్ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ నరసింహ, ఉప్పల్ ప్రాంతీయ మేనేజర్, షైన్ సీనియర్ రాజు, డిపో మేనేజర్ పాల్గొని ప్రసంగించారు.బహుకుమార్ సీఈఓ డాక్టర్ శైలేంద్ర గౌడ్ మాట్లాడుతూ, ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలు, మానవీయ తప్పిదాలపై అవగాహన కల్పిస్తూ,ప్రతి డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో రోడ్డు భద్రత, డ్రైవింగ్ ప్రమాణాలు, ప్రయాణికుల భద్రతకు సంబంధించిన అంశాలపై వివరించారు.టీజీఎస్ఆర్టీసీ అధికారులు మాట్లాడుతూ, డ్రైవర్లు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని, ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. టీజీఎస్ఆర్టీసీ ప్రతిష్ఠను మరింత పెంచే విధంగా సేవలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న డ్రైవర్లకు రోడ్డు భద్రత నిబంధనలు, ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించడంతో పాటు,విధుల్లో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



**ఎల్బీనగర్,ఆగస్ట్ 18,(ప్రజావినికిడి):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర యువజన అధ్యక్షుడు చంద్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో యువజన ప్రధాన కార్యదర్శి భిమగాని మహేష్ గౌడ్ పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు చంద్రశేఖర్,మహేష్ గౌడ్ మాట్లాడుతూ పాపన్న యొక్క ధైర్యం,పోరాట పటిమను కొనియాడారు. పాపన్న గౌడ్ నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి గోల్కొండ కోటను అధిరోహించిన వ్యక్తి పాపన్న అని అన్నారు.పాపన్న సూచించిన విధంగా బహుజనులు రాజ్యాధికారం వైపు అడుగులు వేయలన్నారు.ప్రభుత్వం ట్యాంక్ బండ్ పై సర్ధార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు.

# యాదవ భవన్ నిర్మాణానికి ముందడుగు.. : అంజయ్య యాదవ్ భరోసా

**యాదవ భవన్ నిర్మాణానికి అంజయ్య యాదవ్ సానుకూల స్పందన**




**షాద్ నగర్,(ప్రజావినికిడి):** అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో షాద్‌నగర్ నియోజక వర్గంలోని యాదవ కుల బంధువులు మంగళవారం రోజు ఎక్లాస్ ఖాన్‌పేట గ్రామంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో యాదవ భవన్ నిర్మాణం కోసం చర్చించారు. యాదవ భవన్ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సానుకూలంగా స్పందించారు. తము అధికారంలో ఉన్నప్పుడు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందని, అనివార్య కారణాల వలన భవన నిర్మాణం జరగలేకపోయిందని,కాగా అవసరమైతే భవన్ నిర్మాణానికి స్థలం సమకూర్చేందుకు సహకరిస్తామని, స్థలం చూపిస్తే భవన నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. యాదవ భవన్ నిర్మాణానికి అంజయ్య యాదవ్ సానుకూలంగా స్పందించడంపై యాదవ కుల బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

# ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

**బహుజన రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలి**



**ఎల్బీనగర్,ఆగస్ట్ 18, (ప్రజావినికిడి):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి ఉత్సవాలు హయత్ నగర్ ప్రగతి నగర్ లోని గౌడ సంఘంలో అధ్యక్షుడు నక్క వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘ నాయకులు పాపన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సంఘ నాయకులు పాపన్న యొక్క ధైర్యం ,పోరాట పటిమను కొనియాడారు. పాపన్న గౌడ్ నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి గోల్కొండ కోటను అధిరోహించిన వ్యక్తి పాపన్న అని అన్నారు.పాపన్న సూచించిన విధంగా బహుజనులు రాజ్యాధికారం వైపు అడుగులు వేయలన్నారు.ప్రభుత్వం ట్యాంక్ బండ్ పై సర్ధార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో నక్క దర్శన్ గౌడ్,ప్రభాకర్ గౌడ్,సునీల్ గౌడ్,చెన్నగొని రవీందర్ గౌడ్,కార్యదర్శి శ్రీధర్ గౌడ్,రమేష్ గౌడ్,దాస్ గౌడ్,చంద్రయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వాజేడు గురుకుల కళాశాల ను తరలిస్తే ఊరుకునేది లేదు

**గురుకులాన్ని ఏటూరునాగారం తరలించడం పై ఆగ్రహం వ్యక్తం చేసిన.ఏఎన్ఎస్ జిల్లా అధ్యక్షులు ఎట్టి విద్యాసాగర్..**

**ఉద్యమం చేస్తామని హెచ్చరిక.. -ఏఐ యుగం లో కూడా అడవి బిడ్డలకు అందని నాణ్యమైన విద్య..**



**వాజేడు,ఆగష్టు 19,(ప్రజావినికిడి):** వాజేడు మండల కేంద్రంలో ఏఎన్ఎస్, ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షులు మోడెం నాగరాజు అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిగా హాజరైన అధ్యక్షులు ఎట్టి విద్యాసాగర్ మాట్లాడుతూ, వాజేడు వెంకటాపురం మండలాలు పూర్తిగా ఏజెన్సీ ప్రాంతమైనప్పటికీ ఒక్క గురుకుల కళాశాల కూడా లేదని ప్రభుత్వాలతో మొరపెట్టుకుంటే ఒక ట్రైబల్ వెల్ఫేర్ బాలికల జూనియర్ కళాశాల మంజూరు చేయడం జరిగినదని అన్నారు.కానీ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల జూనియర్ కళాశాలకు భవనాలు కట్టకుండా ప్రభుత్వం కాలయాపన చేసిందని సాగర్ ఆరోపించారు. ఈ ప్రభుత్వం ఆదివాసి పిల్లలకు విద్యను దూరం చేయలానే కుట్రలో భాగంగానే జరిగిందని విమర్శించారు. ఐటిడిఎ,పిఓ. ఏజెన్సీ విద్యను బలోపేతం చేసే దిశగా దృష్టి పెట్టక పోవడం కారణంగానే ఏటూరునాగారం కి గురుకులం తరలించారు అన్నారు.నేటి పాలక ప్రభుత్వం వాజేడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గురుకుల కళాశాలను, విద్యార్థుల తల్లిదండ్రులతో మీటింగ్ ఏర్పాటు చేయకుండానే రాత్రికిరాత్రే పిల్లలను ఏటూరునాగారం తరలించడం జరిగినదని అన్నారు.దీనిని ఆదివాసి నవనిర్మాణ సేనా తీవ్రంగా ఖండిస్తోంది అన్నారు. గురుకుల కళాశాలను తిరిగి తీసుకు రావాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఏటూరునాగారం లో ఇప్పటికే అన్నిరకాల విద్యావస్థలు ఉన్నప్పటికీ ఈ రెండు మండలాలకు సంబందించి గురుకుల కళాశాలను తరలించడం పట్ల తీవ్ర అగ్రహాన్ని వ్యక్తం చేసారు. టెక్నాలజీ పెరిగి ప్రపంచం ఒక కుగ్రామం అయిందని,ఏఐ యుగం లో బ్రతుకుతున్న సమయంలో నాణ్యమైన విద్య కోసం వందల కిలోమీటర్లు వెళ్లాల్సి రావడం అన్యాయం అన్నారు.వేల కోట్ల గిరిజన సబ్ ప్లాన్ నిధులను వెచ్చించి నాలుగు ఏళ్ళు అవుతున్న పక్కా భవనం ఎందుకు కట్టలేదని అయన ప్రశ్నించారు. ఏజెన్సీ విద్య పైన నిజంగా ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే పక్కా భవనం కట్టేవారని అన్నారు.ఈ సమావేశంలో పాయం.విజయ్ కుమార్,తలడి ప్రసాద్,కణితి విజయ్ బొగ్గుల. దేవేందర్ పార్శిక, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు

# పాలిటెక్నిక్ విద్యను యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావద్దు

**పాలిటెక్నిక్ విద్యపై '97' జీవోను వెనక్కి తీసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి కి వినతి పత్రం అందించిన ఆకాష్ నాయక్**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** తెలంగాణ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి-యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలన్ జీఓఎంఎస్ నెం.97 నిర్ణయాన్ని తక్షణమే నిలిపివేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్ డిమాండ్ చేశారు.ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా నాయకులు, విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు.
పాలిటెక్నిక్ కళాశాలలను పీపీపీ విధానంలో నడిచే యూనివర్సిటీ పరిధిలోకి తీసుకెళ్తే పేద, మధ్యతరగతి, గ్రామీణ విద్యార్థులపై భవిష్యత్‌లో అధిక ఫీజుల భారం పడే ప్రమాదం ఉందన్నారు.ప్రత్యేక సాంకేతిక విద్యా వ్యవస్థ స్వతంత్రత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు.డిప్లొమా విద్యార్థుల ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలపై అనిశ్చితి లేకుండా చూడాలని కోరారు.జీఓఎంఎస్ నెం.97ను ఉపసంహరించుకోవడంతో పాటు, పాలిటెక్నిక్ విద్య స్వతంత్రతను కాపాడాలని,ఖాళీ అధ్యాపక పోస్టులు భర్తీ చేసి ఆధునిక ల్యాబ్‌లు,పరికరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులతో చర్చించిన తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

# పేరూరు ఆశ్రమ పాఠశాలలో హెల్త్ క్యాంపు

**విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు**




**వాజేడు,ఆగష్టు 19,(ప్రజావినికిడి):** పేరూరు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా మంగళవారం రోజు ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి చికిత్స ఆరోగ్య సలహాలు అందించారు.ఈ సందర్భంగా ఆడపిల్లలకు ఎచ్ పి వి,టీకా ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన కల్పించారు.ఎచ్ పి వి,వైరస్ వల్ల కలిగే కొన్ని వ్యాధుల నివారణలో ఎచ్ పి వి,టీకా ఉపయోగపడుతుందని,అర్హత ఉన్న బాలికలు వైద్యుల సూచన మేరకు టీకా తీసుకోవాలని ఆరోగ్య సిబ్బంది వివరించారు. అనంతరం పాఠశాల హాస్టల్‌లో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత, పోషక విలువలపై పరిశీలన చేసి, విద్యార్థులకు ఆరోగ్యకరమైన సమతుల్య ఆహారం అందించేలా సంబంధిత సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు అందించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ భాస్కర్ ఎచ్ఎం, భద్రాచలం, ఎచ్ఈఓ, వేణుగోపాలకృష్ణ, ఎచ్ వి,సరిత, ఎఎన్ఎం, శకుంతల,శ్రీను, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, పాఠశాలల్లో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తామని ఆరోగ్య సిబ్బంది తెలిపారు. ఆరోగ్యవంతమైన విద్యార్థి ఆరోగ్యవంతమైన సమాజానికి పునాదిఅని వారు తెలిపారు

# 14 గంటల్లో 51 రోబోటిక్ బేరియాట్రిక్ సర్జరీలు..

## డా.మోహిత్ భండారి -టీమ్ మొహక్ సరికొత్త రికార్డు..




**హిమాయత్ నగర్,(ప్రజావినికిడి):** భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా డా. మోహిత్ భండారి,టీమ్ మొహక్ ఒక అసాధారణ విజయాన్ని సాధించారు. ఆగస్టు 15న కేవలం 14 గంటల్లో 51 రోబోటిక్ బేరియాట్రిక్, మెటబాలిక్ సర్జరీలను విజయవంతంగా పూర్తి చేశారు.

ఈ అపూర్వ కార్యక్రమంలో ఆరు రోబోటిక్ సిస్టమ్స్,ఒక నియమిత కన్సోల్ సర్జన్ అత్యంత సమన్వయంతో పనిచేసిన భారతీయ క్లినికల్ బృందం పాల్గొంది. అధునాతన రోబోటిక్ బేరియాట్రిక్ సర్జరీలను పెద్ద స్థాయిలో నిర్వహించగల సామర్థ్యాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.ఈ విజయానికి విస్తృతమైన ప్రణాళిక, ప్రామాణిక విధానాలు, శస్త్రచికిత్స, అనస్థీషియా, నర్సింగ్ సపోర్ట్ టీమ్‌ల మధ్య సమన్వయం, అలాగే 14 గంటల పాటు ఒకే స్థాయి నాణ్యతను కొనసాగించే సామర్థ్యం అవసరమైందను మొత్తం 51 మంది రోగులకు రోబోటిక్ బేరియాట్రిక్ మెటబాలిక్ సర్జరీలు నిర్వహించగా, వారిలో 30 మంది పురుషులు, 21 మంది మహిళలు ఉన్నారు. రోగుల వయస్సు 21 నుంచి 77 సంవత్సరాల మధ్య ఉండగా, సగటు వయస్సు 43.6 సంవత్సరాలు. వారి సగటు శరీర బరువు సుమారు 122 కిలోలు.డా. మోహిత్ భండారి 40,000కు పైగా బేరియాట్రిక్ సర్జరీలను నిర్వహించిన విస్తృత క్లినికల్ అనుభవం కలిగిన నిపుణుడు. 51 మంది రోగులతో కూడిన ఈ కార్యక్రమం వివిధ రకాల బేరియాట్రిక్ మెటబాలిక్ అవసరాలు కలిగిన రోగులను నిర్వహించడంలో ఆయనకు ఉన్న విస్తృత అనుభవాన్ని ప్రతిబింబిస్తుంది.ఈ కార్యక్రమాన్ని బాహ్య పరిశీలనలో నిర్వహించడంతో పాటు,అధికారిక గుర్తింపు కోసం సంబంధిత డాక్యుమెంటేషన్‌ను గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్కు సమర్పించారు.రికార్డు ప్రయత్నానికి మించి,ఈ కార్యక్రమం సాంకేతికత, వైద్య నైపుణ్యం అత్యుత్తమ నిర్వహణా సామర్థ్యాలు కలిసివస్తే శస్త్రచికిత్స సామర్థ్యాన్ని గణనీయంగా విస్తరించవచ్చని నిరూపించింది.

# ఆర్టీసీ లైసెన్స్డ్ పోర్టర్ల సమస్యలను పరిష్కరించాలి




**హిమాయత్ నగర్,(ప్రజావినికిడి):**

ఆర్టీసీ బస్టాండ్లలో ఏళ్ల తరబడి ప్రయాణికులకు సేవలందిస్తున్న లైసెన్స్డ్ పోర్టర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించి, వారికి తగిన ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ డిమాండ్ చేశారు. హైదరాబాద్, హిమాయత్ నగర్లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ఆర్టీసీ లైసెన్స్డ్ పోర్టర్స్ కౌన్సిల్ రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎం.నరసింహ మాట్లాడుతూ, ఎండనక, వాననక నిరంతరం శ్రమిస్తున్న పోర్టర్ల సంక్షేమాన్ని ప్రభుత్వం,ఆర్టీసీ యాజమాన్యం విస్మరించడం సరికాదన్నారు. లైసెన్స్డ్ పోర్టర్లందరికీ పూర్తిస్థాయి ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రస్తుత ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు కూలీ రేట్లను పెంచాలి. పోర్టర్ల కుటుంబాలకు భరోసా కల్పించేందుకు హెల్త్ ఇన్సూరెన్స్, యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ సౌకర్యాలను ప్రభుత్వం కల్పించాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్లలో పోర్టర్లు విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేకంగా రెస్ట్ రూమ్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 6,7,8 తేదీలలో నిర్వహించనున్న ఏఐటీయూసీ 4వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ను నాయకులు ఆవిష్కరించారు. ఈ మహాసభలను కార్మికులంతా ఐక్యంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ జనరల్ సెక్రెటరీ జి.దాస్, యూనియన్ ముఖ్య నాయకులు సీతయ్య,సీను, సత్యనారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# అగర్తలో యూడీఆర్టీఐ శిక్షణా తరగతులు

## ప్రొఫెసర్ పి.నర్సింగ్ రావు

**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):**



పట్టణాభివృద్ధి పరిశోధన, శిక్షణ సంస్థ (యూడీఆర్టీఐ) ఆధ్వర్యంలో త్రిపుర రాజధాని అగర్తలో అగర్తలా మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణా తరగతుల కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ నర్సింగ్ రావు ప్యారసాని తెలిపారు. బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నందికంటి సాయికుమార్ తో కలిసి వారు మాట్లాడారు. ఆగస్ట్ 19 నుంచి 21 వరకు జరిగే కార్యక్రమంలో ఉద్యోగుల సామర్థ్య నిర్మాణం, నైపుణ్యాభివృద్ధి వ్యూహాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. యూడీఆర్టీఐ బృందంలో ప్రొఫెసర్ నర్సింగ్ రావుతో పాటు ఇంజనీర్ అజ్మీరా కృష్ణ,పి.సాయి కిరణ్ పాల్గొంటారని తెలిపారు. మున్సిపల్ ఆదాయ అభివృద్ధి వ్యవస్థలపై ప్రొఫెసర్ నర్సింగ్ రావు,నీటి సరఫరా నిర్వహణ వ్యవస్థలపై ఇంజనీర్ అజ్మీరా కృష్ణ శిక్షణ అందించనున్నారు.2001లో హైదరాబాద్ లో స్థాపించబడిన యూడీఆర్టీఐ ఇప్పటి వరకు దేశంలోని వివిధ పట్టణ,స్థానిక సంస్థల్లో సుమారు 75 శిక్షణా తరగతుల కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.

# ఘనంగా సర్వాయి పాపన్న 376వ జయంతి వేడుకలు

**అంబర్ పేట్ (ప్రజావినికిడి):**



సర్దార్ సర్వాయి పాపన్న 376వ జయంతి వేడుకలను బాగ్ అంబర్ పేట బురుజుగల్లిలోని గౌడ సంఘం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంబర్ పెట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, అంబర్ పేట డివిజన్ మాజీ కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ తో కలిసి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి, ప్రత్యేకశీగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సబ్బండ వర్గాలకు, రాజకీయ, సామాజిక, సమానత్వం కోసం చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందని కొనియాడారు. మాజీ కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, కుల మతాల వివక్ష లేకుండా అన్ని వర్గాలు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలని,సమ సమాజ స్థాపన స్ఫూర్తితో ఆనాటి కాలంలోనే ధీరత్వంతో పోరాడారని గుర్తు చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీరాములు ముదిరాజ్, మహేష్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# చేగురు పరిధిలోని కన్హా శాంతి వనంలో చెరువులు, నీటి కుంటలు,వాటర్ చెక్ డాం ల పరిశీలన అనుమతి కొరకు

## రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి లేఖ రాసిన షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు..



జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి



బక్కని నరసింహులు..

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం సముద్రమట్టానికి ఎత్తైన ప్రదేశం ఉన్నది కాబట్టి రైతులు వర్షాధార పంటలపై ఆధారపడి జీవిస్తుంటారని, పూర్వకాలంలో కాకతీయులు,

కూలి కుతుబ్ షాహీ వంశస్థులు, నిజాం హయాంలో చెరువులు,కుంటలు,పాటు కాలువలు నిర్మించగా ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సామాజికవేత్త అన్న హజారే సూచనలతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని షాద్ నగర్ నియోజకవర్గం(55) వాటర్ షెడ్లు మంజూరు చేయగానియోజకవర్గంలోని అన్నారం గ్రామంలో ఉత్తర ప్రదేశ్ మాజీ గవర్నర్ సత్యనారాయణ రెడ్డి తన స్వగ్రామం అయినా అన్నారం గ్రామంలో వాటర్ షెడ్ పథకం ఆవిష్కరణలో సామాజికవేత్త అన్న హజారే పాల్గొని వాటర్ షెడ్ పథకాన్ని ప్రారంభించారు.

అలాగే షాద్ నగర్ నియోజకవర్గం లోని నందిగామ మండలం చేగూరు గ్రామపంచాయతీలో వ్యవసాయ భూములను కొనుగోలు చేసిన కొంతమంది వ్యాపారవేత్తలు చెరువులు, కుంటలు,వాటి స్వరూపాన్ని కోల్పోయేలా చేశారని మాకు ఫిర్యాదు రాగా నేను స్వయంగా చేగూరు గ్రామాన్ని సందర్శించి చూడగా కొన్ని చెరువుల ఎఫ్.టి.ఎల్ పరిధిలో మరికొన్ని చెరువులు బఫర్ జోన్ పరిధిలో ఆక్రమించి ప్రహరీ గోడలు నిర్మించినట్లు గుర్తించడంజరిగింది, చెరువులు,కుంటలు,బండ్ల బాటలు,పాటు కాలువలను చూడాలంటే కన్హా ఆశ్రమం చుట్టూరా ఎత్తైన ప్రహరీ గోడ నిర్మించి గేటు నిర్మాణం చేపట్టారు.అందువలన నేను నీటిపారుదల శాఖ నుండి (ఆర్ టి ఐ) యాక్ట్ ద్వారా 24/12/2025 న సమాచారం కోరగా నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ వారు తేదీ 22/12/2025 న చేగురు గ్రామం పరిధిలో మొత్తం (19) చెరువులు కుంటలు (2)రెండు చెక్ డ్యామ్లు ఉన్నట్లుగా సమాచారం ఇచ్చారు కన్హా శాంతి వనం పరిసర ప్రాంతాల్లో (7)ఏడు చెరువులు,కుంటలు ఉండగా (5)ఐదు చెరువులు పూర్తిగా ఆశ్రమంలో ఉండి రెండు చెరువులు ఆశ్రమం లో పాక్షికంగా ఉన్నట్లు వారు తెలిపారు. గ్రామంలో బోకులకుంట స్థలాకృతి (తోపో షీట్) లో కలదు కానీ భూమిపై కనిపించడం లేదని ఇట్టికుంట ప్రిలిమినరీ నోటిఫైడ్ చేయడం జరిగింది.ఫైనల్ నోటిఫైడ్ చేయవలసి ఉందని అధికారులు తెలిపారు అన్నారు.సర్వే నెంబర్లు,మరియు క్లుప్తంగా ఏదైనా సమాచారం కావాలంటే నందిగామ తహసిల్దార్ ని సంప్రదించమని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. అందువలన నేను పై చెరువులు కుంటలను ప్రజలకు ఉపయోగకరమైన వాటిని పరిశీలించాలంటే ఆశ్రమంలోనికి వెళ్లడానికి అడ్డుగా ప్రహరీ గోడ నిర్మించారు. కావున దయచేసి కన్హా శాంతి వనంలోని చెరువులు స్వరూపాన్ని తెలుసుకొనుటకు అనుమతించాలని మీ ద్వారా కోరడమైనది.

# తెలంగాణ నుంచి అమెరికా వరకు విస్తరిస్తున్న ఈసీజీ హరిత ఉద్యమం

**రంగారెడ్డి (ప్రజావినికిడి):**







పర్యావరణ పరిరక్షణ కోసం తెలంగాణతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో హరిత ఉద్యమాన్ని కొనసాగిస్తున్న ఎన్విరాన్మెంటల్లి కన్సియస్ గ్లోబలిసాషన్ (ఈసీజీ ) ఫౌండేషన్ తాజాగా తన పర్యావరణ సందేశాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లింది. ఇప్పటికే 2 కోట్లకు పైగా మొక్కలు నాటిన ఈసీజీ ,"గ్రీన్ గ్లోబలిసాషన్ ఫర్ ఆ బెటర్ అండ్ హెల్త్య నేషనల్ " లక్ష్యంతో హరిత యజ్ఞాన్ని ముందుకు తీసుకెళ్తోంది.

ప్రముఖ బాలల వైద్య నిపుణులు, పర్యావరణవేత్త, వృక్షజీవి డా. మార్కండేయులు ఆధ్వర్యంలో పర్యావరణవేత్తలు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులు ఈ ఉద్యమంలో భాగస్వాములవుతున్నారు.

ఈసీజీ "థింక్ గ్లోబల్లి-యాక్ట్ ఎకలోజికల్లి " మిషన్‌లో భాగంగా ఈసీజీ కోర్ మెంబెర్ , బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బర్చ్ ) మాజీ ప్రిన్సిపల్, ప్రెసిడెంట్ అవార్డ సుదర్శన్ అమెరికాలో తన కుటుంబ సభ్యులతో కలిసి మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అమెరికాలో పనిచేస్తున్న తన పిల్లలను సందర్శించిన సందర్భంగా కుటుంబ సభ్యులకు పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను వివరించి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి హేమలత, కుమార్తెలు తేజస్విని, మానస్విని, అల్లుళ్లు రామకృష్ణ, శశాంక్, మనుమలు వివాన్,అనికా పాల్గొన్నారు. ముఖ్యంగా చిన్నారులు కూడా మొక్కల నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావడం ద్వారా పర్యావరణ బాధ్యతను తదుపరి తరానికి అందించాలనే ఈసీజీ ఆలోచనకు ఇది చక్కటి ఉదాహరణగా నిలిచింది.

**ఈసీజీ సందేశాన్ని ప్రపంచానికి తీసుకెళ్లడం అభినందనీయం: డా. మార్కండేయులు**

అమెరికాలో నిర్వహించిన కార్యక్రమంపై డా. మార్కండేయులు హర్షం వ్యక్తం చేశారు.సుదర్శన్ ఈసీజీ సందేశాన్ని భారతదేశ సరిహద్దులు దాటి అమెరికాకు తీసుకెళ్లడం సాధారణ మొక్కల నాటే కార్యక్రమం కాదని,ఈసీజీ ప్రపంచవ్యాప్త పర్యావరణ దృక్పథానికి ఇది ప్రతీక అని అన్నారు.ఈసీజీ సభ్యులు ఎక్కడికి వెళ్లినా ఈసీజీ స్ఫూర్తిని తమతో తీసుకెళ్తారు. వారు నివసించే ప్రదేశం మారినా పర్యావరణంపై వారి బాధ్యత మారదు. అదే ఈసీజీ సంస్కృతి"అని పేర్కొన్నారు.

వివాన్,అనికా వంటి చిన్నారులు కార్యక్రమంలో పాల్గొనడం తనకు ప్రత్యేక ఆనందాన్ని కలిగించిందని తెలిపారు.చిన్న వయస్సులోనే పిల్లలను మొక్కల నాటడం,ప్రకృతి పరిరక్షణ వంటి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం ద్వారా వారిలో జీవితాంతం పర్యావరణ బాధ్యతను పెంపొందించవచ్చన్నారు.

పర్యావరణ విద్య తరగతి గదులకే పరిమితం కాకూడదని, కుటుంబం నుంచే పర్యావరణ సంస్కృతి ప్రారంభం కావాలని డా. మార్కండేయులు పిలుపునిచ్చారు. నేటి పిల్లలే రేపటి భూమి సంరక్షకులని, వారికి చిన్న వయస్సు నుంచే ప్రకృతితో అనుబంధం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

"థింక్ గ్లోబల్లి యాక్ట్ ఎకలోజికల్లి " కేవలం నినాదంగా కాకుండా ప్రతి ఒక్కరి జీవన విధానంగా మారాలని ఆకాంక్షించారు. మొక్కలు నాటడం,జీవ వైవిధ్యాన్ని కాపాడడం, కాలుష్యాన్ని తగ్గించడం, ఆరోగ్యకరమైన పరిసరాలను నిర్మించడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు.ఈసీజీ సభ్యులు వివిధ దేశాల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ చైతన్య కుటుంబాలు, సమాజాల బలమైన నెట్‌వర్క్ ఏర్పడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.సుదర్శన్ కుటుంబ సభ్యులకు, ముఖ్యంగా చిన్నారులకు అభినందనలు తెలియజేస్తూ,ఈ కార్యక్రమం విదేశాల్లో నివసిస్తున్న మరెన్నో భారతీయ కుటుంబాలకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

పర్యావరణ పరిరక్షణ,గ్రీన్ ఎన్విరాన్‌మెంట్, బయోదివర్సిటీ బాలన్స్ కోసం ఈసీజీ ఫౌండేషన్ అంతర్జాతీయ స్థాయిలో భాగస్వామ్యాలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తోందని డా. మార్కండేయులు తెలిపారు. యూకె లోని భాగస్వాములతో భవిష్యత్ సహకార కార్యక్రమాలపై కూడా ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు.

**ఈసీజీ సందేశాన్ని ఆచరణలో చూపిస్తున్నారు :.డా.వెంకట్ నోములా**

ఈసీజీ సభ్యులు డా.వెంకట్ నోములా మాట్లాడుతూ, సుదర్శన్ ఈసీజీ సందేశాన్ని అమెరికాకు తీసుకెళ్లి కుటుంబ సభ్యులను హరిత కార్యక్రమంలో భాగస్వాములను చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.ఈసీజీ సభ్యులు ఎక్కడికి వెళ్లినా పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని తమతో తీసుకెళ్లడమే కాకుండా ఆచరణలో చూపిస్తున్నారని తెలిపారు.

అమెరికా ప్లాంటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్న కుటుంబ సభ్యులు

సుదర్శన్ – ఈసీజీ కోర్ మెంబెర్,బర్చ్ మాజీ ప్రిన్సిపల్, ప్రెసిడెంట్ అవార్డ

హేమలత సతీమణి

తేజస్విని కుమార్తె

మానస్విని కుమార్తె

రామకృష్ణ అల్లుడు

శశాంక్ అల్లుడు

వివాన్ మనుమడు

అనికా మనుమరాలు

అమెరికాలో నిర్వహించిన ఈ మొక్కల నాటే కార్యక్రమం తెలంగాణలో ప్రారంభమైన ఈసీజీ హరిత స్ఫూర్తి ఇతర రాష్ట్రాలను దాటి అంతర్జాతీయ స్థాయికి చేరుతున్నదానికి గొప్ప ఉదాహరణగా నిలిచింది.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలు

## పాపన్న ఆశయ సాధనకు కృషి చేయాలి: మల్లేష్ గౌడ్

**ఎల్బీనగర్,ఆగస్ట్ 18, (ప్రజావినికిడి):**






సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి ఉత్సవాలు ఎల్బీనగర్ చౌరస్తాలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ రాష్ట్ర సంఘము అధ్యక్షులు అంబాల మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ లోని మహనీయుల కుడాలిలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పలు రాజకీయ పార్టీల నాయకులు పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అంబాల మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ, పాపన్న గౌడ్ నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి గోల్కొండ కోటను అధిరోహించిన వ్యక్తి పాపన్న అని అన్నారు.పాపన్న యొక్క చరిత్రను ప్రస్తుత ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయన్నారు.పాపన్న యొక్క చరిత్రను పాఠ్య పుస్తకాలలో ముద్రించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వం ట్యాంక్ బండ్ పై సర్ధార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమని అన్నారు.బహుజన విప్లవ వీరుడు,అగ్ర కుల రాజ్యాల వల్ల పాపన్న కు సరైన గుర్తింపు రాలేదన్నారు. ప్రభుత్వం ఏదైనా ఒక జిల్లాకు పాపన్న నామకరణం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, స్థానిక ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి,భాజపా నాయకులు సామ రంగారెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్దగోని రామ్ మోహన్ గౌడ్ ,జక్కిడి ప్రభాకర్ రెడ్డి,లక్ష్మీ ప్రసన్న,సిపిఎం పార్టీ నాయకులు,బిసి సంక్షేమ సంఘ నాయకులు జాజుల శ్రీనివాస్ గౌడ్,బీసి సంఘ నాయకులు,పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్,వనపల్లి శ్రీనివాస్ రెడ్డి,కొప్పుల నరసింహ రెడ్డి,కళ్లెం నవజీవన్ రెడ్డి,కొత్త ప్రభాకర్ గౌడ్,కొప్పుల విటల్ రెడ్డి,సంఘ కార్య నిర్వహక అధ్యక్షులు పల్లె గణేష్ గౌడ్,ఉపాధ్యక్షుడు కొత్త వెంకటేష్ గౌడ్,బొడిగే స్వామి గౌడ్, ప్రధాన కార్యదర్శులు వెంకట రమణ గౌడ్,వెంకటేష్ గౌడ్,కోశాధికారి లక్ష్మీపతి గౌడ్,సంతోష్ గౌడ్,కిషోర్ గౌడ్,కిషన్ గౌడ్,జాంగీర్ బాబు గౌడ్,బత్తిని శ్రీనివాస్ గౌడ్,మల్లేష్ గౌడ్,తరుణ్ గౌడ్,రాకేష్ గౌడ్,బొడిగే వెంకటేష్ గౌడ్,రాజు గౌడ్,చరణ్ గౌడ్,ప్రశాంత్ గౌడ్,పలు కుల సంఘాలు పాపన్న అభిమానులు పాల్గొన్నారు.

# 22ఎ జాబితాలో పొరపాటుగా నమోదైన పట్టా భూములను పరిశీలిస్తాం..

## ప్రజలు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదు.. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి..





**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
22ఎ జాబితాకు సంబంధించిన అంశాలపై ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ భూములు, ప్రభుత్వ ఆస్తులు అలాగే చట్టపరంగా నిషేధిత జాబితాలో చేర్చాల్సిన భూములను మాత్రమే నిబంధనల ప్రకారం 22ఎ జాబితాలో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు.
మంగళవారం శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూ రికార్డుల నిర్వహణ, 22ఎ జాబితాకు సంబంధించిన అంశాలు,ప్రజల నుంచి అందుతున్న దరఖాస్తులు,
భూ రికార్డుల సవరణ ప్రక్రియ తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు.అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ, 22ఎ జాబితాలో నమోదైన భూములకు సంబంధించి కొన్ని సందర్భాల్లో పాత సర్వే నంబర్లు,కొత్త సర్వే నంబర్లకు జరిగిన మార్పులు, సరిహద్దులు, భూముల విభజన తదితర వివరాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు.పాత సర్వే నంబర్ల ఆధారంగా ఉన్న భూములు, అనంతరం వచ్చిన సర్వే నంబర్లలో మిగిలిపోయిన భూములు, సరిహద్దుల ఆధారంగా స్పష్టత అవసరమైన అంశాలను అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే హైకోర్టు, సుప్రీంకోర్టు తదితర న్యాయస్థానాల తీర్పుల ఆధారంగా సంబంధిత భూములకు వర్తించే అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. భూ రికార్డులకు సంబంధించి పహాణీలు, రిజిస్ట్రేషన్ రికార్డులు,పాత సర్వే నంబర్లు, సర్వే రికార్డులు, ఇతర సంబంధిత ప్రభుత్వ రికార్డులను సమగ్రంగా పరిశీలించి వాస్తవ పరిస్థితిని నిర్ధారించాలని అధికారులను ఆదేశించారు. కేవలం ఒక రికార్డును ఆధారంగా చేసుకుని నిర్ణయం తీసుకోకుండా, సంబంధిత అన్ని రికార్డులను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం తుది నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు.

**యుఎల్ సి భూములపై ప్రత్యేక పరిశీలన**

పట్టణ ప్రాంతాల్లో గతంలో అర్బన్ ల్యాండ్ సెయిలింగ్ (ఉల్సీ )కు సంబంధించిన భూములు కూడా ఉన్నాయని, వాటికి సంబంధించిన రికార్డులను ప్రత్యేకంగా పరిశీలిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు, ముఖ్యంగా జీ ఒ 765 వంటి ఉత్తర్వుల ఆధారంగా గతంలో జరిగిన చర్యలు, డిప్రెషన్/విముక్తి తదితర అంశాలను పరిశీలించి, అర్హత ఉన్న భూముల విషయంలో నిబంధనల ప్రకారం తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. గతంలో భూ రికార్డులను సవరించుకోని వారు లేదా సంబంధిత ప్రక్రియను పూర్తి చేయని వారు నిబంధనల ప్రకారం సంబంధిత సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, రెవెన్యూ అధికారులను సంప్రదించి తమ భూ రికార్డులను పరిశీలించుకోవాలని సూచించారు.

**హెచ్ఎండిఏ పరిధిలోని భూములపైనా పరిశీలన**

హెచ్ఎండిఏ పరిధిలోని భూములకు సంబంధించి కూడా రికార్డులను పరిశీలిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వానికి చెందిన భూములు, ప్రభుత్వ ఆస్తులు మరియు చట్టపరంగా 22ఎ పరిధిలోకి వచ్చే భూములను మాత్రమే సంబంధిత నిబంధనల ప్రకారం గుర్తించి జాబితాలో ఉంచాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. జెన్యూన్ పట్టా భూమి ఏదైనా పొరపాటున 22ఎ జాబితాలో నమోదై ఉంటే ప్రజలు అధైర్యపడాల్సిన అవసరం లేదు. అటువంటి భూములను కూడా త్వరలో పరిశీలించి, అందుబాటులో ఉన్న రికార్డులు మరియు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటాం.. అని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలకు ఎటువంటి అన్యాయం జరగకుండా, అందుబాటులో ఉన్న పహాణీలు, రిజిస్ట్రేషన్ రికార్డులు,పాత సర్వే వివరాలు, సరిహద్దులు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు, న్యాయస్థానాల తీర్పులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని భూ రికార్డులకు సంబంధించిన సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించనున్నట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి స్పష్టం చేశారు.

# పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ వెంటనే విడుదల చేయాలి..

**విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేసి వేధిస్తున్న ప్రైవేట్ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి..**

**ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కేవై ప్రణయ్..**




**శంషాబాద్ (ప్రజావినికిడి): ఆగస్టు18,** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కేవై ప్రణయ్ డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ కేంద్రంలోని జాతీయ రహదారి 44 పై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ప్రణయ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌ను విడుదల చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటికీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో నిధులు అందలేదని విమర్శించారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఆ భారాన్ని విద్యార్థులు,వారి తల్లిదండ్రులపై మోపడం అన్యాయమన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం చెల్లించాల్సిన నిధులు కాగా, వాటిని విద్యార్థుల నుంచి బలవంతంగా వసూలు చేయడం సరికాదన్నారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు,టి.సి, మెమోలు,ఇతర విద్యా పత్రాలను కళాశాలలు తమ వద్ద ఉంచుకుని విద్యార్థులను, తల్లిదండ్రులను వేధిస్తున్న ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని విద్యార్థుల సర్టిఫికెట్లను ఎలాంటి షరతులు లేకుండా అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేసే విద్యాసంస్థలపై కఠినమైన చర్యలు తీసుకోవడంతో పాటు, విద్యార్థుల నుంచి అక్రమంగా వసూలు చేసిన మొత్తాలను తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌ను సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల వేలాది మంది విద్యార్థులు తమ చదువులను కొనసాగించలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు.ప్రభుత్వం విద్యార్థుల చదువును బాధ్యతగా చూడాలి తప్ప, ప్రైవేట్ కళాశాలల ఆర్థిక ప్రయోజనాలకు విద్యార్థులను బలిచేయకూడదని అన్నారు. పెండింగ్ నిధులను విడుదల చేయకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం రాష్ట్ర ప్రభుత్వ విద్యా విధాన వైఫల్యానికి నిదర్శనమన్నారు.రాష్ట్రంలో ఉన్నత విద్యను పేద విద్యార్థులకు అందుబాటులో ఉంచాలంటే స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌ను ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విడుదల చేసే విధంగా శాశ్వతమైన నిధుల విడుదల వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులను కాపాడేందుకు ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంట్స్ విడుదల చేయడంతో పాటు విద్యార్థుల సర్టిఫికెట్లను వెంటనే అందించాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్ ఎస్ఎఫ్ఐ నాయకులు తనిష్క్, అభినవ్, రుద్రాక్ష,సాయి హర్ష,నిహారిక, రామ్ చరణ్,తరుణ్,రాజేష్ విష్ణువర్ధన్, విధార్థులు పాల్గొన్నారు.




# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు

**ఘన నివాళులర్పించిన ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**తెలంగాణ బహుజన వీరుడు, సామ్రాజ్యవాద నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన ధీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను షాద్‌నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ, సామాన్య కల్లుగీత కార్మిక కుటుంబంలో జన్మించి,మొఘల్ సామ్రాజ్య పునాదులను కదిలించిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని,నిరంకుశ భూస్వామ్య పోకడలపై తిరుగుబాటు చేసి,గోల్కొండ కోటపై బహుజన జెండాను ఎగురవేసిన ధీరుడని,అణచివేతకు గురైన వర్గాలను ఏకం చేసి,సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన సామాజిక విప్లవకారుడిగా ఆయన చరిత్రలో నిలిచారని అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్,కౌన్సిలర్ అనితరఘునాథ్ యాదవ్,వాణి పాండురంగ రెడ్డి,గౌస్ జానీ,మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్,కానుగుఅనంతయ్య,చింటు ప్రతాప్ రెడ్డి,చిన్న యాదగిర,జూపల్లి శంకర్,గౌడ సంఘం నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# పాపన్న గౌడ్ పోరాటం నేటి తరానికి ఆదర్శం

**ప్రజల ఆత్మగౌరవం, హక్కుల కోసం ఆయన పోరాటం స్ఫూర్తిదాయకం**





**ఎల్బీనగర్; ఆగస్టు18, (ప్రజావినికిడి):**సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని తెలంగాణ మహిళా జన సమితి ఆర్గనైజింగ్ సెక్రటరీ పుష్ప నీల గౌడ్ అన్నారు.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా అంబాల మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పుష్ప నీల గౌడ్ మాట్లాడుతూ, ప్రజల ఆత్మగౌరవం, హక్కుల కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందన్నారు. సామాజిక అసమానతలను ఎదుర్కొంటూ అణగారిన వర్గాల కోసం ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పాపన్న గౌడ్ ధైర్యం,త్యాగం, పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని ఆమె అన్నారు. ఆయన ఆశయాలను ఆచరణలోకి తీసుకువచ్చి సామాజిక న్యాయం, సమానత్వం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని పుష్ప నీల గౌడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అధ్యక్షులు అంబాల మల్లేష్ గౌడ్, లింగోజిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంది కంటి శ్రీధర్ గౌడ్, అంతటి శ్రీనివాస్ గౌడ్,జహంగీర్ బాబు గౌడ్, నీరజ గౌడ్, ఉషారాణి,జెల్ల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి ఉత్సవాలు

**పాల్గొని ఘనంగా నివాళులు అర్పించిన బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, బీజేపీ షాద్‌నగర్ ఇంచార్జ్ అందె బాబయ్య**



**షాద్‌నగర్,(ప్రజావినికిడి):**
తెలంగాణ గడ్డపై అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన మహా వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 376వ జయంతి ఉత్సవాలను షాద్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, బీజేపీ షాద్‌నగర్ ఇంచార్జ్ అందె బాబయ్యతో పాటు అశోక్ గౌడ్,కుమార్ గౌడ్ ప్యాట అశోక్,మల్చం మురళి,శ్రీనివాస్ చారి,అరవింద్ చారి,అభిలాష్ గౌడ్,రవి నాయక్,నరసింహ,అశోక్,చందు గౌడ్ అలాగే ఉత్సవ సమితి సభ్యులు తదితరులు కార్యక్రమంలో పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,సామాన్య కుటుంబంలో జన్మించి,తన ధైర్యం, నాయకత్వం, పోరాట స్ఫూర్తితో ప్రజలను సమీకరించి, అప్పటి మొఘల్ ఆధిపత్యం, దోపిడీ,అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన పాపన్న గౌడ్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు.ప్రజల ఆత్మగౌరవం, సమానత్వం, స్వేచ్ఛ కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.అన్యాయాన్ని ఎదిరించే ధైర్యం ఉంటే సామాన్యుడు సైతం చరిత్రను సృష్టించగలడనే గొప్ప సందేశాన్ని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం మనకు అందిస్తుందని అన్నారు.తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ వీరత్వం, త్యాగం,పోరాట స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

# సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం..





## ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..

**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా ఎల్బీనగర్ కూడలి వద్ద ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ వీరత్వానికి,ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన గొప్ప యోధుడు.బహుజనుల హక్కుల కోసం పోరాడిన ధీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్.సామాజిక సమానత్వం,ప్రజల స్వేచ్ఛ కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకం.అణగారిన వర్గాల కోసం ఆయన చూపిన ధైర్యం,త్యాగం చిరస్మరణీయం.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పిస్తూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనందరి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి,లింగాల రాహుల్ గౌడ్,మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మొరిశెట్టి సంతోష్ కుమార్ జన్మదిన వేడుకలు





**మన్సూరాబాద్, ఆగస్ట్18, (ప్రజావినికిడి):**మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని తన నివాసంలో జన్మదిన వేడుకలు సోమవారం నాడు ఎంతో అంగరంగ వైభవంగా జరిగాయి..జన్మదిన వేడుక సందర్భంగా నివాసం వద్ద పండుగ వాతావరణం నెలకొంది.బిజెపి నాయకులు కార్యకర్తలు స్థానిక ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో వచ్చి మొరిశెట్టి సంతోష్ కుమార్ కు పుష్పగుచ్చాలు అందజేసి శాలువాతో సన్మానించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో,సుఖ సంతోషాలతో ఉండాలని రానున్న రోజుల్లో రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం మొరిశెట్టి సంతోష్ కుమార్ మాట్లాడుతూ, తన జన్మదినాన్ని పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేసిన వారికి ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# షాద్‌నగర్ మున్సిపాలిటీలో తెలంగాణ ఉద్యమకారుల సమావేశం..

ముఖ్య అదిథిగా తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పి. వెంకట్ రాంరెడ్డి..



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్‌నగర్ మున్సిపాలిటీ అద్యక్షులు శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల సమగ్ర జాబితాను రూపొందించేందుకు తెలంగాణ ఉద్యమకారులు సమావేశమయ్యారు. ముఖ్య అదిథిగా తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ రంగారెడ్డి జిల్లా అద్యక్షులు పి. వెంకట్ రాంరెడ్డి హాజరయ్యారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో షాద్‌నగర్ ప్రాంతం నుంచి పాల్గొన్న ఉద్యమకారుల వివరాలను సేకరించి,వారి పేర్లు, ఉద్యమంలో పాల్గొన్న సందర్భాలు మరియు ఇతర వివరాలతో కూడిన జాబితాను తయారు చేయాలని సమావేశంలో నిర్ణయించారు.
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు చేసిన త్యాగాలు,పోరాటాలు,సేవలను గుర్తించి భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందని సమావేశంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు.
షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిదిలో తెలంగాణ ఉద్యమకారులందరూ తమ వివరాలను అందించి ఈ కార్యక్రమానికి సహకరించాలని సమావేశం ద్వారా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.లక్ష్మి నరసింహ్మా రెడ్డి,గాదె సుధాకర్, మేకల వెంకటేష్,రవిగౌడ్, అల్లాడ శేఖర్,గుండు అశోక్, పులిజాల నవీన్,వంశీకృష్ణ, సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎసిబికి చిక్కిన టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్

## 20 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

**హైదరాబాద్,ఆగస్టు 18:(ప్రజావినికిడి):**



నగరంలోని ఫూల్‌బాగ్‌లోని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో అవినీతిపై ఏసీబీకి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఆ కార్యాలయంలో ఏసీబీ ఆధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ప్రభావతి.. రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడింది. దీంతో ఆమెను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. ప్రభావతిపై కేసు నమోదు చేశారు. ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే.. తమకు ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా ప్రజలకు ఏసీబీ అధికారులు సూచించారు. మరో వైపు అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నప్పటికీ సిబ్బందిలో ఎటువంటి మార్పు రావడం లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. తరచూ ఎప్పుడో అక్కడ.. ఎప్పుడో అప్పుడు లంచం తీసుకుంటూ ప్రభుత్వ ఉద్యోగులు ఏసీబీ అధికారులకు పట్టుబడుతున్నారు. తాజాగా ఫూల్‌బాగ్‌లోని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో అటువంటి ఘటనే చోటు చేసుకుంది.

# మద్యం మత్తులో యువకుడి దారుణ హత్య

## స్నేహితులే హత్య చేసినట్లు పోలీసుల గుర్తింపు

**రంగారెడ్డి,ఆగస్టు 18:(ప్రజావినికిడి):**
రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మద్యం మత్తులో స్నేహితులే అతడిని కిరాతకంగా చంపేశారు. రివర్స్ కేఫ్ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడు బిహార్‌కు చెందిన అనికేత్‌గా గుర్తించారు. అనికేత్.. తన స్నేహితులు రోహిత్, రాహుల్, అంకిత్‌లతో కలిసి మద్యం సేవించాడు. ఈ సమయంలో స్నేహితుల మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. తీవ్ర ఆగ్రహానికి గురైన రాహుల్.. అనికేత్ తల వెనుక భాగంలో ఐరన్ రాడ్‌తో బలంగా కొట్టాడు. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. అపస్మారకస్థితిలో ఉన్న యువకుడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అనికేత్ మరణించినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణను వేగవంతం చేశారు.

# మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అరెస్ట్

## మైనింగ్ క్వారీ ప్రమాదం కేసు

## అనుకూల నివేదిక కోసం లంచం డిమాండ్




**అమరావతి(ప్రజావినికిడి):**
:ప్రకాశం జిల్లాలో మైనింగ్ క్వారీలో జరిగిన ప్రమాదం కేసులో అనుకూల నివేదిక కోసం లంచం డిమాండ్ చేసిన వ్యవహారంలో పలువురి ప్రమేయం ఉన్నట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ గుర్తించింది. ఈ నేపథ్యంలో మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. అలాగే ప్రైవేట్ మైనింగ్ సంస్థ ప్రతినిధి, కన్‌స్టలెంట్‌ను అరెస్ట్ చేశారు. వీరిని విజయవాడ కోర్టులో హాజరుపరచనున్నారు. గతంలో మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు రూ. లక్ష లంచం ఇచ్చినట్లు కూడా సీబీఐ గుర్తించింది. అనుకూల నివేదికతో పాటు మైనింగ్ సంస్థ నుంచి త్రైమాసిక లంచాల కోసం రూ. 2 లక్షలు ఏర్పాటు చేసినట్లు కనుగోంది. మైనింగ్ క్వారీ ప్రమాదంలో అనుకూల నివేదిక కోసం రూ. 2 లక్షల నగదు తీసుకుంటూ డిప్యూటీ డైరెక్టర్‌ను సీబీఐ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న సంగతి తెలిసిందే. సందర్భంగా ఆ నగదును సీబీఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒంగోలు, కడప, హైదరాబాద్‌లలో నిందితులకు చెందిన ఇళ్లలో కూడా సీబీఐ సోదాలు చేపట్టింది. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని సీబీఐ అధికారులు ఈ సందర్భంగా వివరించారు.

# బహుజనుల ఆరాధ్యుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్..

## జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు,మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు..





**షాద్ నగర్,(ప్రజావినికిడి);**బహుజన విప్లవ వీరుడు,బహుజనుల ఆరాధ్యుడు,ధీరుడు,గోల్కొండ ఖిల్లాను పాలించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఫారుక్ నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామంలోని ఈత వనంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు,షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు ముఖ్య అతిథిగా హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసిఘనంగానివాళు లర్పించారు.ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటాలు, బహుజన సమాజ అభ్యున్నతికి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు.ఆయన ఆశయాలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.
పాల్గొన్నారు.ప్రకృతిని మనం కాపాడితే అది మన భవిష్యత్తు తరాలకు మంచి చేస్తుందని,10 దిగుడు బావులు ఒక చెరువుతో సమానం,100 చెరువుల ఒక కొడుకుతో సమానం అని ఒక చెట్టు రెండున్నర లక్షల కిలోల ఆక్సిజన్ విడుదల చేస్తుందన్నారు అందుకని మనం ప్రకృతి ప్రసాదించిన వనరులను చెర పెట్టకుండ. భవిష్యత్తు తరాలకు అందియాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందన్నారు. గతంలో చటాన్ పల్లి,నాగులపల్లి,లింగారెడ్డిగూడెం అల్లిసబ్ గుడ,రాసమల్ల గూడెం,గ్రామాలను స్వచ్ఛమైన కళ్ళు అమ్మేవారన్నారు,నేడు కల్తీ కళ్ళు అమ్ముతున్నారానా అపవాదు గౌడ కులస్తుల,సోదరుల పైన ఉందన్నారు,కాబట్టి గౌడ సోదరులు ఈత వనాలను పెంచి స్వచ్ఛమైన కళ్ళు ప్రజలకు అందించాలని సూచించారు.
స్వతంత్రం కోసం పోరాడిన పుణ్యపురుషుల జయంతి,వర్ధంతి ఉత్సవాలు ప్రతి గ్రామంలో నిర్వహించాలన్నారు.రాజకీయంలో అభివృద్ధిపై దృష్టి పెట్టలే తప్ప ప్రధానమంత్రిని,సీఎంని, మంత్రలను దూషించే ఆనవాయితీ మానుకోవాలి అని ఆయన హితవుపలికారు. లింగారెడ్డిగూడెం గ్రామం పక్కనే ఉన్న పాట కాలువ పైన గతంలో ఐదు లక్షలు వేచించి పునరుద్ధరించడం జరిగింది.కానీ నేడు రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమాలకు గురికావడం విచారకరమన్నారూ.అందుకనిధర్మానికి అందరూ కట్టుబడి ఉంటే ఆ ధర్మం మానవులను రక్షిస్తుందన్నారు. బహుజనలు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని బక్కని నరసింహులు కొనియాడారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్5 చల్ల శ్రీకాంత్ రెడ్డి,లింగారెడ్డి గూడ గ్రామ సర్పంచ్ ప్రవీణ్,ఉప సర్పంచ్ అశోక్,టిడిపి సీనియర్ నాయకులు కుమార్ గౌడ్,ఆన్మారి వెంకటయ్య, చింతలపల్లి సర్పంచ్ యాదయ్య,గౌడ సంఘం నాయకులు,గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు. గౌడ కులస్తుల,సోదరుల పైన ఉందన్నారు,కాబట్టి గౌడ సోదరులు ఈత వనాలను పెంచి స్వచ్ఛమైన కళ్ళు ప్రజలకు అందించాలని సూచించారు.
స్వతంత్రం కోసం పోరాడిన పుణ్యపురుషుల జయంతి,వర్ధంతి ఉత్సవాలు ప్రతి గ్రామంలో నిర్వహించాలన్నారు.రాజకీయంలో అభివృద్ధిపై దృష్టి పెట్టలే తప్ప ప్రధానమంత్రిని,సీఎంని, మంత్రలను దూషించే ఆనవాయితీ మానుకోవాలి అని ఆయన హితవుపలికారు. లింగారెడ్డిగూడెం గ్రామం పక్కనే ఉన్న పాట కాలువ పైన గతంలో ఐదు లక్షలు వేచించి పునరుద్ధరించడం జరిగింది.కానీ నేడు రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమాలకు గురికావడం విచారకరమన్నారూ.అందుకనిధర్మానికి అందరూ కట్టుబడి ఉంటే ఆ ధర్మం మానవులను రక్షిస్తుందన్నారు. బహుజనలు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని బక్కని నరసింహులు కొనియాడారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ చల్ల శ్రీకాంత్ రెడ్డి,లింగారెడ్డి గూడ గ్రామ సర్పంచ్ ప్రవీణ్,ఉప సర్పంచ్ అశోక్,టిడిపి సీనియర్ నాయకులు కుమార్ గౌడ్,ఆన్మారి వెంకటయ్య, చింతలపల్లి సర్పంచ్ యాదయ్య,గౌడ సంఘం నాయకులు,గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ లో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం..

ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం..
రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం..
డ్రైవర్లకు యూనిఫామ్ తప్పనిసరి..
షాద్ నగర్ ట్రాఫిక్ సిఐ శంకరయ్య..





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని బుగ్గారెడ్డి గార్డెన్స్‌లో షాద్‌నగర్ పోలీస్ స్టేషన్,ఫీచర్ సిటీ ఆధ్వర్యంలో డ్రైవర్లు,వాహనదారులకు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ నిబంధనలు,రోడ్డు భద్రత, డ్రైవింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా ఏసీపీ చంద్రశేఖర్ మాట్లాడుతూ,
ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు.భారతదేశంలో ఏటా సుమారు 1.50 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని,తెలంగాణలో కూడా ప్రతి సంవత్సరం వేలాది మంది ప్రమాదాల బారినపడి మృతి చెందుతున్నారని తెలిపారు.వాహనం నడిపే సమయంలో డ్రైవర్ల పూర్తి దృష్టి రోడ్డుపైనే ఉండాలని సూచించారు.
అనంతరం సీఐ శంకరయ్య మాట్లాడుతూ,ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలంటే డ్రైవర్లు సమన్వయంతో వ్యవహరించి,రూల్స్ ప్రకారం వాహనాలను రోడ్డుపై నిలపాలని సూచించారు.డ్రైవర్లు తమ జీవనోపాధిపై దృష్టి సారిస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని,సెల్‌ఫోన్ మాట్లాడుతూ లేదా ఇతర వైపులకు దృష్టి మళ్లిస్తూ డ్రైవింగ్ చేయకూడదని అన్నారు.ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం ప్రతి డ్రైవర్ బాధ్యత అని తెలిపారు.ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని,లైసెన్స్‌కు సంబంధించిన నూతన నిబంధనలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ తరచూ ఫైన్లు విధించబడితే, పాయింట్ల విధానం ప్రకారం డ్రైవింగ్ లైసెన్స్‌పై ప్రభావం పడుతుందని హెచ్చరించారు.డ్రంక్ అండ్ డ్రైవ్,అతివేగం వంటి వాటికి దూరంగా ఉండాలని సీఐ శంకరయ్య సూచించారు.

**మానవ తప్పిదాలే ప్రధాన కారణం.**
**-ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్**

రోడ్డు ప్రమాదాలకు రహదారులపై గుంతలు, ఇంజనీరింగ్ లోపాలు,అతివేగం,సిగ్నల్ నిబంధనలు పాటించకపోవడం వంటి కారణాలు ఉన్నప్పటికీ, ఎక్కువ శాతం ప్రమాదాలు మానవ నిర్లక్ష్యం వల్లే జరుగుతున్నాయని అధికారులు తెలిపారు.మద్యం సేవించి వాహనం నడపడం వల్ల డ్రైవర్ల నియంత్రణ కోల్పోయి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని హెచ్చరించారు.డ్రైవర్లకు యూనిఫామ్ తప్పనిసరి, ట్రాఫిక్ సిఐ శంకరయ్య
డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని అధికారులు సూచించారు. యూనిఫామ్‌లో ఉన్నప్పుడే డ్రైవర్‌ను ప్రయాణికులు, పోలీసులు సులభంగా గుర్తించగలరని తెలిపారు.సివిల్ డ్రెస్‌లో ఉండి డ్రైవర్ అని చెప్పుకోవడం వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు.పోలీసులు వాహనాలను తనిఖీ చేయడం ట్రాఫిక్ నిబంధనల్లో భాగమేనని, వ్యక్తిగత కారణాలతో ఎవరినీ ఆపరని స్పష్టం చేశారు. ముఖ్యంగా డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ ఉపయోగించకూడదని సూచించారు.ఒక చేతితో స్టీరింగ్ పట్టుకుని మరో చేతితో ఫోన్ మాట్లాడటం వల్ల వాహనంపై నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.మనిషి ప్రాణం ఎంతో విలువైనది.. దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదీ అని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై వెంకటేష్,ఏఎస్ఐ ఆర్ రవీందర్, సిబ్బంది,డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# దిమాగీ నక్సల్స్..మరో పార్టీ పుట్టుక

## ప్రధాని నోట మాటరావడం ఆలస్యం.. -సోషల్ మీడియాలో ఉత్పన్నం

**న్యూఢిల్లీ,ఆగస్టు 18 (ప్రజావినికిడి):**కాక్రోచెస్ అంటూ సుప్రీం చీఫ్ జస్టిస్ చేసిన వ్యాఖ్యల ఆధారంగా కాక్రోచ్ జనతాపార్టీ పుట్టుకు వచ్చింది. ఇటీవల ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద తన సత్తా చాటింది. ఇప్పుడు ఇలాంటిదే మరో పార్టీ పుట్టుకు వచ్చింది. సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించామని.. దిమాగీ నక్సల్స్ మాత్రం మిగిలారంటూ ఎర్రకోట వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. ఈ వ్యాఖ్యల ఆధారంగా కొత్తపార్టీ పుట్టుకువచ్చింది. మోదీ ఆ వ్యాఖ్యలు చేసిన 24 గంటల్లోనే దిమాగీ నక్సల్ అనే పేరుతో ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లో తెరిచిన పార్టీ ఖాతాలకు అనూహ్య ఆదరణ లభించింది. ఇన్‌స్టాలో 1.81 లక్షలమంది, ఎక్స్‌లో 7000 మంది ఆ ఖాతాలను అనుసరించారు. ఇన్‌స్టాలో దిమాగి నక్సల్ జనతా పార్టీ అనే పేరుతో ఖాతాలు తెరిచారు. యువత ప్రశ్నించడమే కాదు, సమస్యలకు పరిష్కార మార్గాలను కూడా వెతకాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఐఐటీ ఢిల్లీ యాభై ఏడవ స్నాతకోత్సవంలో చేసిన వ్యాఖ్యల సంగతి ఎలా ఉన్నా యువత ప్రశ్నిస్తూనే ఉంది. సమస్యలకు పరిష్కరాం చూపాలని ప్రధాని మోడీ అనడం చూస్తుంటే..పాలకులు ఎందుకన్న ప్రశ్న ఉదయిస్తోంది. నిజానికి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఎవరిది? అధికారంలో ఉన్న పాలకులదాకాదా అన్నది తేల్చాలి. 2014లో బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పుడు యువతకు ఎన్నో ఆశలు కల్పించింది. ఉద్యోగాల కల్పన, నైపుణ్యాభివృద్ధి, తయారీ రంగం విస్తరణ, పెట్టుబడుల పెంపు, అవినీతి




నిర్మూలన, నల్లధనాన్ని వెనక్కి రప్పించడం వంటి అంశాలపై ఎన్నో హామీలు ఇచ్చారు. అవన్నీ మరచిపోవడం మోడీకి తగదు. ఇవన్నీ పక్కన పెట్టి దిమాగీ నక్సల్స్ అని మేధావులను దూషించడం కూడా సరికాదు. ఇప్పటివరకు యువతకు ఎన్ని ఉద్యోగాలు వచ్చాయంటే.. చెప్పలేం. ఆందోళనలు చేస్తున్న యువతను చూసైనా పాలకులు కళ్లు తెరవాలి. పేపర్ లీకేజీలతో విద్యార్థుల ఆశలపై నీల్లు చల్లడం వల్లనే కదా యువత ఆందోళన బాట పట్టింది. నీట్ వివాదం ఈ పరిస్థితికి ఒక ఉదాహరణ మాత్రమే. విద్యార్థులు నెలల తరబడి ఆందోళనలు చేస్తే, వారి సమస్యలను వినడం, విచారణ జరిపించడం, బాధ్యులపై చర్యలు తీసుకోవడం లాంటి పనులను ప్రభుత్వం చేయడంలేదు. పైగా నిరసనకారులకు 'పరిష్కారం మీరే చూపండి' అని చెప్పడం ద్వారా ఏం సందేశాన్ని ఇవ్వదలుచుకున్నారో మేడీ చెప్పాలి. ఈ చర్య నిశితంగా పరిశీలిస్తే ప్రభుత్వం పాలనా బాధ్యతలు నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టుగా ఉంది. పరిష్కారం చూపాలంటే ముందు యువతకు అధికారంలో భాగస్వామ్యం కల్పించాలి. నిజానికి యువత కోరుతున్నది కూడా ఈ దేశ అభివృద్ధిలో తమను కూడా భాగస్వాముల్ని చేయమని, తమకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించమని అంటున్నారు. తద్వారా వికసిత భారత్‌లో తమను కూడా భాగస్వాములను చేయమంటున్నారు. ఇవి ఏవీ జరగకుండా, అన్నింటికీ దూరంగా ఉంచడం వల్ల అభివృద్ధి ఎలా జరుగుతుందని అనుకుంటున్నారో వివరించాలి. యువత ప్రశ్నలు నీట్‌కే పరిమితం కావాల్సిన అవసరం లేదు. పెరుగుతున్న విదేశీ అప్పు, ధరలు, నిరుద్యోగం, అవినీతి ఆరోపణలు, పరిపాలనలో జవాబుదారీతనం, రాజకీయ ఫిరాయింపులు, దర్యాప్తు సంస్థలు, ఎన్నికల వ్యవస్థ వంటి కీలక సంస్థల స్వతంత్రతపై వ్యక్తమవుతున్న సందేహాలు.. ఇవన్నీ ప్రశ్నించాల్సిన అంశాలే. అయితే ప్రభుత్వం తన అధికారాన్ని ప్రశ్నను అణచడానికి కాకుండా, సమస్యను పరిష్కరించడానికి వినియోగిస్తే అసలు సమస్యే ఉండదు. కానీ ప్రభుత్వ ధోరణి అలా కనిపించడం లేదు. యువత పరిష్కారాలు చూపాలి, అయితే ప్రభుత్వాన్ని ప్రశ్నించకూడదు అంటే కుదరదు. అందుకుఏ దిమాగీ నక్సల్ అనగానే పార్టీ పుట్టుకు వచ్చింది. ఇది ఓ రకంగా ప్రశ్నించడానికే అనుకోవాలి. ప్రశ్నలకు నాయకులు పరిష్కారాలు చూపించడానికి సిద్ధంగా ఉండాలి.

# అక్టోబర్ 2న రానున్న సందీప్ కిషన్ సిగ్మా




కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు సీఎం విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవు తున్న మోస్ట్ అంటెసిపేటెడ్ యాక్షన్ హీస్ట్ డ్రామా 'సిగ్మా'. టాలెంటెడ్ హీరో సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ వచ్చింది. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా అధికారిక విడుదల తేదీని ప్రకటించారు. గాంధీ జయంతి కానుకగా అక్టోబర్ 2వ తేదీన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన సరికొత్త పోస్టర్‌లో సందీప్ కిషన్ మునుపెన్నడూ లేని విధంగా అత్యంత ఇంటెన్స్ లుక్‌లో కనికట్టు చేస్తున్నారు. ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన టాలెంటెడ్ బ్యూటీ ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తుండగా, నూతన దర్శకుడి ప్రతిభకు తగ్గట్టుగా భారీ తారాగణం ఈ సినిమాలో భాగమైంది. ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు రాజు సుందరం, వర్సటైల్ యాక్టర్ సంపత్ రాజ్, శివ్ పండిట్, అన్బు దాసన్, యోగ్ జాపీ, షీలా రాజ్‌కుమార్ మరియు కిరణ్ కొండ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. థమన్ ఈ సినిమాకు అదిరిపోయే సంగీతం అందిస్తుండగా, కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు మరియు ప్రవీణ్ కేఎల్ ఎడిటింగ్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా విడుదల తేదీ ఖరారు కావడంతో, రాబోయే రోజుల్లో టీజర్, పాటలతో పాటు ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇకపోతే ఈ సినిమాలో అగ్ర కథానాయకుడు రామ్ చరణ్ అతిథి పాత్రలో కనిపించనున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ సినిమాలో 'మ్లలెపూల పల్లకి బంగారు పల్లకి' అంటూ సాగే పాటలో రామ్ చరణ్ అయ్యప్ప మాలధారణలో కనిపిస్తారని.. కొన్ని పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వీటిపై రామ్‌చరణ్ టీమ్ తాజాగా స్పందించింది. అవి రూమర్స్ అంటూ ఖండించింది. అసత్యాలను ప్రచారం చేయొద్దని విజ్ఞప్తి చేసింది.

# ఇరుముడికి యూ/ఎ సర్టిఫికెట్

## రామ్‌చరణ్ గెస్ట్ రోల్ ప్రచారాలను ఖండించిన టీమ్




టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా సంచలన చిత్రం 'ఇరుముడి' థియేట్రికల్ విడుదలకు సర్వం సిద్ధం చేసుకుంది. దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మరియు ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా 'యు/ఎ' సర్టిఫికేట్‌ను సొంతం చేసుకుంది. అలాగే సినిమా రన్‌టైమ్‌ను రెండు గంటల ఇరవై ఐదు నిమిషాల నిడివితో లాక్ చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రంలో రవితేజ పూర్తి భిన్నమైన, సరికొత్త పాత్రలో కనిపించనున్నారు. మధ్యతరగతి కుటుంబసభ్యుడిగా, కూతురు పాత్రలో నటించిన బేబీ నక్షత్రాతో ఆయన సాగే అనుబంధం ఈ సినిమాకు ప్రధాన భావోద్వేగ బలంగా నిలవనుంది. ముఖ్యంగా ఆల్కహాల్ వ్యసనంతో పోరాడే ఒక మధ్యతరగతి వ్యక్తి జీవితం, భవిష్యత్తులో అయ్యప్ప దీక్షను స్వీకరించి మాల ధరించిన తర్వాత ఎలాంటి ఆధ్యాత్మిక పరివర్తన చెందుతుందనే కోణంలో ఈ కథ సాగనుంది. గ్రామీణ వాతావరణం, సహజసిద్ధమైన లొకేషన్లు మరియు ఏజెన్సీ ప్రాంతాల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని, ఇది ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని పంచుతుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సాయి కుమార్, అజయ్ ఘోష్, స్వసిక తదితరులు కీలక పాత్రలలో కనిపించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఆగస్టు 21వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున గ్రాండ్ థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది.

----




# డిసి చిత్రంపై అల్లు అర్జున్ ప్రశంసలు

తమిళ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టిస్తున్న 'డీసీ' చిత్రంపై టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రశంసలు కురిపించారు. ఇప్పటికే రూ. 85 కోట్ల వసూళ్లను సాధించి, రూ. 100 కోట్ల క్లబ్ దిశగా దూసుకెళ్తున్న ఈ సినిమాపై ఆయన సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. 'ఈ సినిమా ఒక అద్భుతమైన తమిళ క్లాసిక్ అని, సినిమాను ప్రేమించే ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా చూడాల్సిన చిత్రమని ఆయన కొనియాడారు. ఈ చిత్రాన్ని అర్థం చేసుకోగలిగే వారికి ఇది ఒక కవితలా ఉంటుందని' బన్నీ అభివర్ణించారు. ఇక దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ మేకింగ్ స్టైల్‌కు తాను ఫిదా అయ్యానని తెలుపుతూ, చిత్ర బృందం మొత్తానికి ఆయన అభినందనలు తెలియజేశారు. ముఖ్యంగా ఈ సినిమాకు ప్రాణం పోసిన సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పనితీరును అబ్సల్యూట్ మాస్టర్ బూస్టర్‌గా బన్నీ అభివర్ణించారు. సాంకేతికంగా కూడా ఈ చిత్రం అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కిందని ఆయన పేర్కొన్నారు. నటీనటుల విషయానికి వస్తే, వామికా గబ్బి నటన అద్భుతమని మెచ్చుకుంటూనే, ప్రధాన పాత్రలో హీరోగా నటించిన దర్శకుడు లోకేష్ కనగరాజ్ నటనను కూడా ప్రత్యేకంగా ప్రశంసించారు. తన మిత్రుడు లోకేష్ కనగరాజ్ తనకు ఎల్లప్పుడూ ఒక గొప్ప మద్దతుగా ఉంటారని అల్లు అర్జున్ సంతోషం వ్యక్తం చేశారు. విడుదలైన కొద్ది కాలంలోనే బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబడుతూ, సినీ వర్గాల్లో 'డీసీ' మూవీ హాట్ టాపిక్‌గా మారింది.

-------------

# సంక్రాంతి బరిలో మెగా 158 మూవీ




మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం మెగా158 నుంచి సినీ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రాన్ని సంక్రాంతి 2027 కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అనుకున్న ప్లాన్ ప్రకారం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే దాదాపు 40 రోజుల చిత్రీకరణ విజయవంతంగా పూర్తయింది. సినిమాకు సంబంధించి ఫస్ట్ హాఫ్ ఎడిటింగ్ దాదాపు పూర్తయి లాక్ అయినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బ్జడెట్‌తో ఈ విజువల్ స్పెక్టాకిల్‌ను నిర్మిస్తోంది. మెగాస్టార్ పుట్టినరోజైన ఆగస్ట్ 22న సినిమా నుంచి అదిరిపోయే అఫీషియల్ అప్‌డేట్ విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. బాబీ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా మీద భారీ అంచనాలు ఉన్నాయి. మన శంకర వరప్రసాద్ గారు లాంటి బ్లాక్ బస్టర్, వాల్తేరు వీరయ్య లాంటి కాంబో కావడంతో ఈ సినిమా మీద కూడా ముందు నుంచి అందరి ఫోకస్ ఉంది. ఇప్పటికే సంక్రాంతికి అనిల్ రావిపూడి వెంకటేష్ కళ్యాణ్ రామ్ సినిమా. రవితేజ శ్రీవిష్ణు ఎంటర్‌టైనర్, శర్వానంద్- శ్రీనువైట్ల కాంబో చిత్రం, ప్రశాంత్ వర్మ 'మహాకాళి', సాయి దుర్గా తేజ్ సంబరాల ఏటిగట్టు సినిమాలు ఉండగా ఇప్పుడు మెగాస్టార్ సినిమా కూడా అదే సీజన్ మీద కన్నేయడంతో ఏం జరగనుంది అనేది చూడాలి.

# అనుపమ వ్యాఖ్యల ఎఫెక్ట్..

## తొలిసారి మౌనం వీడిన ధ్రువ్ విక్రమ్!



గత కొన్ని వారాలుగా తన వ్యక్తిగత జీవితంపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై యువ నటుడు ధ్రువ్ విక్రమ్ తొలిసారి బహిరంగంగా స్పందించాడు. తన సహనటి అనుపమ పరమేశ్వరన్ గతంలో ఓ రెండేళ్ల సంబంధంలో తాను ఎదుర్కొన్న నియంతృత్వం, నార్సిసిజం గురించి మాట్లాడిన తర్వాత, ఆ వ్యాఖ్యలు ధ్రువ్‌ను ఉద్దేశించేనని పెద్ద ఎత్తున ఊహాగానాలు చెలరేగాయి. ఈ నేపథ్యంలోనే ధ్రువ్ మౌనం వీడాడు.'ఇండియా టుడే తమిళ్' నిర్వహించిన ఒక రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న ధ్రువ్‌ను.. తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న ఈ ప్రచారాన్ని ఎలా ఎదుర్కొంటున్నారని ప్రశ్నించగా.. "నిజం చెప్పాలంటే, ఈ ప్రచారం నన్ను ప్రభావితం చేయలేదని నేను చెప్పలేను. కచ్చితంగా దాని ప్రభావం నాపై పడింది. కానీ, ఇలాంటి సమయంలో వాస్తవానికి కట్టుబడి ఉండటం చాలా ముఖ్యం. మనం ఎవరో, మన విలువేంటో తెలుసుకోవాలి. మనం ప్రేమించే వారిని, మనకు ముఖ్యమైన ప్రతి ఒక్కరినీ కాపాడుకోవాలి" అని ఆయన అన్నారు. బయటివారి అభిప్రాయాల ప్రభావం తనపై ఎక్కువగా ఉండదని చెబుతూ, "మీరు నిజానికి కట్టుబడి ఉన్నప్పుడు, మిమ్మల్ని ఏది నిలబెడుతుందో మీకు తెలిసినప్పుడు, బయటివారి విమర్శలు ఓ స్థాయిని దాటి వెళ్లలేవు. మనకు తెలియకుండానే మనం ఒంటరి సైన్యంలా మారతాం. మనకంటూ ఓ ప్రపంచాన్ని సృష్టించుకుని, మన అంతర్గత బలాన్ని కాపాడుకుంటాం" అని ధ్రువ్ వివరించాడు.ప్రముఖుల జీవితాల్లో ఇలాంటి పరిశీలన సర్వసాధారణమే అయినా, తన ప్రియమైన వారిని కాపాడుకోవడం, వ్యక్తిగత హద్దులు గీసుకోవడం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నాడు. అయితే, ఈ సంభాషణలో ఆయన ఎక్కడా అనుపమ వ్యాఖ్యలను నేరుగా ప్రస్తావించలేదు. వారిద్దరి మధ్య ఏదైనా సంబంధం ఉందన్న ఊహాగానాలపై కూడా స్పందించకుండా సంయమనం పాటించాడు. ప్రస్తుతం ధ్రువ్ విక్రమ్, అనుపమ పరమేశ్వరన్ కలిసి 'బైసన్ కాలమాడన్' అనే చిత్రంలో నటిస్తున్నారు

# నిధి అగర్వాల్ కొత్త సినిమా..

## మైథలాజికల్ థ్రిల్లర్!



హీరోయిన్ నిధి అగర్వాల్ కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈసారి ఆమె ఓ విభిన్న కథతో అలరించనున్నట్లు తెలుస్తోంది. నిధి తదుపరి చిత్రం మైథలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కనుందని సినీ వర్గాల సమాచారం. హీరోయిన్ ప్రధానంగా సాగే ఈ కథలో ఆమె ఇప్పటివరకు చేయని పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది.వరాహ ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమా ఆ సంస్థకు తొలి ప్రొడక్షన్. సునీత్ పడోల్కర్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. 'తంత్ర' ఫేమ్ శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వం వహిస్తున్నాడు. నిధి పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాను పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. అదే రోజు చిత్రీకరణ కూడా మొదలైంది.సినిమా ప్రారంభోత్సవంలో పి. అశోక్, పి. రేణుక తొలి షాట్‌కు కెమెరా స్విచాన్ చేశారు. నిధి అగర్వాల్ చిత్రబృందంతో కలిసి కార్యక్రమంలో పాల్గొంది. ప్రభాస్ నటించిన 'ది రాజా సాబ్', పవన్ కల్యాణ్ నటించిన 'హరి హర వీర మల్లు' చిత్రాల్లో నిధి నటనకు మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు మరో ఆసక్తికరమైన కథతో ఆమె ప్రేక్షకుల ముందుకు వస్తోంది.సినిమా ప్రారంభం సందర్భంగా మేకర్స్ నిధి ఫస్ట్‌లుక్‌ను కూడా విడుదల చేశారు. అందులో ఆమె ఒక చేతిలో దీపం పట్టుకుని.. మరో చేతితో దానికి రక్షణగా నిలిచినట్లు కనిపిస్తోంది. వెనుక భాగంలో అనేక చేతులతో ఉన్న దేవత ఆకారం కనిపిస్తోంది. ఈ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. దర్శకుడు శ్రీనివాస్ గోపిశెట్టి హీరోయిన్ చుట్టూ తిరిగేలా బలమైన కథను సిద్ధం చేసినట్లు సమాచారం. త్వరలోనే సినిమా టైటిల్‌ను ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613